తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక వార్త

# కన్నులపండువగా శ్రీచెంగాళమ్మకు క్షీరాభిషేకం



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త
సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవికి శ్రీక్రోధినామ సంవత్సర మాఘ పౌర్ణమిని పురస్కరించుకొని 108 కలశాల క్షీరంతో అభిషేకాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయ సహాయ కమిషనర్ బి.ప్రసన్నలక్ష్మి ఆధ్వర్యంలో ఉభయదాతలు చెరుకుపల్లి రామ్‌కుమార్‌రెడ్డి దంపతులు కలశాలకు ప్రత్యేక పూజల అనంతరం, కలశాలు చేతబట్టి అమ్మణ్ణి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం కలశాలను అమ్మణ్ణి గర్భాలయంలోని విగ్రహానికి భక్తిశ్రద్ధలతో క్షీరాభిషేకం నిర్వహించారు. చండీయాగాన్ని ఆలయ ప్రాంగణంలోని యాగమండపంలో వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే పట్టణంలోని అభయశంకర దేవస్థానంలో మాఘపౌర్ణమిని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు, అలంకారాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం చేపట్టారు. శ్రీనాగేశ్వరస్వామి దేవస్థానంలోను స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

## ఏటి ఉత్సవానికి
# కదలి వచ్చిన భక్త జనం
### చక్కటి ఏర్పాట్లు: శివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం





సద్యోముక్తి ఉత్సవంలో భాగంగా నదిలో స్నానమాచరిస్తున్న భక్తులు, పంచమూర్తులకు పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాల్లో మాఘమాస పౌర్ణమి సందర్భంగా త్రిశూల స్నానం చేయించటం ఆనవాయితి. బుధవారం త్రిశూల స్నానంతో ఈ హడావిడి చోటు చేసుకుంది. ఈ ఉత్సవంతో మహాశివరాత్రి శ్రీకారం సంకేతాలు ప్రజలకు వెళతాయి. ఏటి ఉత్సవానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు కడలి తరంగాల్లా కదలి వచ్చారు. దీనికి తగ్గట్లు అధికారులు స్థానిక శాసన సభ్యులు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి సూచనలతో ఇఒ టి.బాపిరెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డి వారి సిబ్బంది చక్కగా చేపట్టారు. ప్రతి ఏడాది త్రిశూలంతోపాటు భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చి చలములో దూకేసేవారు. దాంతో ఈ ఏడాది అలాంటి అవకాశం ఇవ్వకుండా త్రిశూలం స్నానానికి ప్రత్యేకంగా చలమును ఏర్పాటు చేసారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు నిర్వహించే ఉత్సవాన్ని సద్యోముక్తి వ్రతం అని, ఏటి ఉత్సవం, చక్రస్నానం, త్రిశూల స్నానం అని చెబుతారు. ఈ సందర్భంగా త్రిశూలాన్ని స్నాన మాచరిస్తారు కాబట్టి త్రిశూల స్నానం అని ప్రఖ్యాతి చెందింది. ఈ ఉత్సవం ఆలయ సంప్రదాయాలు, ఆచారాల మేరకు ఆలయార్చకులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాల్లో శాసన సభ్యుడు సతీమణి బొజ్జల రిషితారెడ్డి, తెలుగుదేశం నాయకులు వారి సహచరులు పాల్గొన్నారు. ఉత్సవర్ల విగ్రహాలైన సోమాస్కందమూర్తి, జ్ఞానప్రసూనాంబదేవి, వళ్లి సుబ్రమణ్యం స్వామి, వినాయకుడు, భక్తకన్నప్ప, చండీకేశ్వరుల విగ్రహాల్ని అలంకార మండపంలో అలంకార గురుకుల్ రాజేష్ చక్కగా ముస్తాబు చేసి బోయిలు మోసుకొస్తుండగా మేళతాళాలు మంగళవాయిద్యాలతో సన్నిధివీధి గుండా జలవినాయకుని ఆలయం నుంచి సువర్ణముఖి నదిలోకి తీసుకొచ్చారు. ఆలయ ప్రధానార్చకులు డాక్టర్‌స్వామినాథన్‌గురుకుల్, అచ్చితా గురుకుల్, సంకల్పంతో పంచమూర్తులకు పూజలు అభిషేకాలు, హోమాలు ప్రారంభించారు. ఆలయ వేద పండితులు అర్ధగిరి, సద్యోముక్తి ఉత్సవానికి సంబంధించి స్థలపురాణం లోని కథను చదివి భక్తులకు వినిపించారు. తరువాత త్రిశూలాన్ని నదీ స్నానానికి తీసుకెళ్ళారు, త్రిశూలాన్ని వెంట వేదపండితులు మంత్రాల్ని ఘోషిస్తూ నదిలో స్నానమాచరింప జేశారు.

### అధికసంఖ్యలో హాజరైన మహిళలు

ప్రతి ఏడాది చోటు చేసుకున్నట్లే త్రిశూలంతో పాటు స్నానమాచరించటానికి మహిళా భక్తులు తండోపతండాలుగా కదలి వచ్చినా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఆలయాధికారులు, పోలీసులు చర్యలు తీసుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాలు చుట్టుపక్కల గ్రామాలకు పండగ వాతావరణాన్ని కల్పిస్తుంది. ఇఒ డి.బాపిరెడ్డి ఆలయాధికారులు డెప్యూటీ ఇఒ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి, ఎఇఒ హేమా మాలిని సూపరింటెండెంట్ నాగభూషణం యాదవ్, హరియాదవ్, సుదర్శనం సిబ్బంది పాల్గొన్నారు. మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, పార్టీ పట్టణ అధ్యక్షుడు విజయ కుమార్ నాయుడు, కంఠరమేష్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మిన్నల్ రవి, మల్లిశ్వరమ్మ, సుమతి తదితరులు పాల్గొన్నారు.

# గరుడునిపై గజేంద్రమోక్షకుడు



తిరుమల, ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:
మాఘ పౌర్ణమి వెలుగుల్లో బుధవారం రాత్రి మలయప్పస్వామి గరుడ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. గరుడునిపై వేంచేసిన మలయప్పకు వాహనమండపం వద్ద ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ కర్పూర హారతులిచ్చారు. అనంతరం భక్తుల గోవింద నామస్మరణల మధ్య గరుడవాహనం మెల్లగా ఆలయం ముందునుంచి కదులుతూ మాఢవీధుల్లో ఊరేగారు. ఈవాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, డిప్యూటీ ఈఓ లోకనాథం, అర్చకులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ వైద్య సేవ కింద
# మెరుగైన వైద్యం
### కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం

చిత్తూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:
జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యం కోసం వచ్చిన వారికి ఎన్టీఆర్ వైద్యసేవ కింద మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ కింద సేవలు అందిస్తున్న నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఫిర్యాదులు అందిన ఆసుపత్రులకు సంబంధించి జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ కింద వైద్యంకు వచ్చే పేషంట్ల నుండి డబ్బులు వసూలు చేసినా, ఇబ్బంది పెట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వం డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ కింద నెట్ వర్క్ ఆసుపత్రుల ద్వారా నిరుపేద ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తుందన్నారు. ఈ సేవలు పొందడానికి వచ్చే రోగుల నుండి నెట్‌వర్క్ ఆసుపత్రులు డబ్బులు వసూలు చేసినా, ఇబ్బంది పెట్టినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆరోగ్య మిత్రలు వైద్యం కోసం వచ్చిన రోగులకు అవసరమైన సలహాలు, వైద్య సేవలు అందించడానికి పూర్తి సహాయ సహకాలు అందించేలా విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకోవాలని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా సమన్వయ అధికారి డాక్టర్ సుదర్శన్‌ను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. ఈ సందర్భంగా నెట్‌వర్క్ ఆసుపత్రులకు సంబంధించి వైద్యం పొందిన రోగుల నుండి 31 ఫిర్యాదులు అందగా సంబంధిత ఆసుపత్రుల ప్రతినిధులతో ఫిర్యాదులకు సంబంధించిన పేషెంట్ల బిల్లులకు సంబంధించిన డాక్యుమెంట్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సమావేశంలో నెట్‌వర్క్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రైల్వే సమస్యలను పరిష్కరించండి
### - ఎంపీ గురుమూర్తి



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త
తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో నెలకొని ఉన్న సమస్యలను, అభివృద్ధి, మౌలిక సదుపాయాలు కల్పనపై పరిశీలించి తక్షణమే చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి బుధవారం భారత రైల్వే బోర్డు ఛైర్మన్, సిఇఒ సతీష్‌కుమార్‌ను న్యూఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. కోవిడ్ సమయంలో వెందోడు, నాయుడుపేట, సూళ్లూరుపేట రైల్వేస్టేషన్లలో కొన్ని రైళ్ల స్టాపింగ్ తీసేశారని, వాటిని పునరుద్ధరించాలని కోరారు. సూళ్లూరు పేట రైల్వేస్టేషన్ తూర్పువైపున నూతనంగా నిర్మించిన టికెట్ బుకింగ్ కౌంటర్‌ను ప్రారంభించాలని కోరారు. అలాగే రైల్వేస్టేషన్ అభివృద్ధిలో భాగంగా నిర్మించిన ఫుట్ ఓవర్ బ్రిడ్జికి తూర్పు వైపున లిఫ్ట్ సౌకర్యం కల్పించాలని, రైల్వే స్టేషన్ సమీపంలోని ఎల్‌సి160 రైల్వేగేటు వద్ద అండర్‌పాస్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. తడ మండలం పెరియవట్టు వద్ద ఎల్‌సి41లో నిలిచిపోయిన అండర్‌పాస్ నిర్మాణాన్ని త్వరితగతిన చేయాలని విజ్ఞప్తి చేశారు. సూళ్లూరుపేట వరకు నడుస్తున్న మెమో రైలును నాయుడుపేట వరకు పొడిగించాలని, రేణిగుంట-గూడూరు మధ్య మూడో రైల్వేలైను, పూడి-ఏర్పేడు మధ్య రైల్వేలైను ఏర్పాటు ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. గూడూరులోని అండర్‌పాస్‌ను విస్తరించాలని, తిరుపతి-విశాఖపట్నం మధ్య నడిచే వందేభారత్ స్లీపర్ రైలును ప్రారంభించాలని కోరారు. తిరుపతి, నెల్లూరు, కడప మధ్య, తిరుపతి, కాడ్పాడి రైల్వే లైను డబ్లింగ్ వంటి అంశాలను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఎంపి గురుమూర్తి రైల్వేబోర్డు ఛైర్మన్‌కు వివరించారు. ఈ సమస్యల పట్ల రైల్వే బోర్డు ఛైర్మన్ సానుకూలంగా స్పందించి త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని ఎంపీ గురుమూర్తికి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

# గోవిందా...గోవింద యని కొలువరో మనసా!
### -భజనలతో కాలినడకన కొండెక్కిన కళాకారులు



తిరుమల, ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవంలో భాగంగా బుధవారం వేకువజామున అలిపిరి పాదాల మండపం వద్ద ప్రాజెక్టు భజనమండలి కళాకారులు, ప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు. దాససాహిత్యప్రాజెక్టు ఆధ్వర్యంలో 3,500మంది భజనమండళ్ల సభ్యులతో కలసి భక్తితో శ్రీవేంకటేశ్వరస్వామిపై భజనలు చేసుకుంటూ కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, దాససాహిత్యప్రాజెక్టు ప్రత్యేక అధికారి పిఆర్ ఆనందతీర్థాచార్య ,సభ్యులు పాల్గొని మెట్లకు పూజలు చేసి ప్రాధాన్యతను తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో ఆధ్యాత్మిక క్షేత్రం తిరుపతిలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం నిర్విఘ్నంగా సాగుతుందోని తెలిపారు.

# గరుడ వాహనంపై కల్యాణ వెంకన్న



చంద్రగిరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:
శ్రీ మహావిష్ణువు నిత్య వాహనమైన గరుడ వాహ నంపై బుధవారం కల్యాణ వెంకన్న ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకుని గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవ మూర్తిని మండపానికి తీసుకువచ్చి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి గరుడ వాహనంపై అధిష్టింప జేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ నిండు పున్నమి పండు వెన్నెలలో దేవదేవుడు ఆలయ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహనసేవలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం. గోపీనాద్, సూపరింటెండెంట్ మునికుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ అనంబట్టు ధనశేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు పార ్ధసారధి, సిబ్బంది కె.భాస్కర్, మరళి కృష్ణమాచార్యులు, రవిచంద్రన్, ఘనాపాటి తిరువేంగడం, జమేదార్ జలంధర్ పాల్గొన్నారు.

# పలమనేరు - కృష్ణగిరి రోడ్డు విస్తరణకు ప్రాథమిక సర్వే

కుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త
జిల్లాలోని పలమనేరు నుంచి తమిళనాడు రాష్ట్రంలోని జిల్లా కేంద్రమైన కృష్ణగిరి వరకు ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 46)ను విస్తరించే అవకాశాలపై జాతీయ రహదారుల శాఖ అధికారులు ప్రాథమిక సర్వే నిర్వహిస్తున్నారు. దాదాపు 110 కి.మీ.ల మేర ప్రస్తుతంఉన్న రహదారిని నాలుగు లైన్ల రహదారిగా మార్చేందుకు ఉన్న సాధ్యాసాధ్యాలపై అధికారులు సర్వే జరుపుతున్నారు. ప్రధానంగా రహదారిలో మలుపులు అనేవి లేకుండా ఉండేలా చూడడంతో పాటు ఒకవేళ జాతీయ రహదారిని విస్తరిస్తే ఏమేర భూసేకరణ చేయాలి, పరిహారం ఎంత చెల్లించాలి, వంతెనలు, బైపాస్ రోడ్ల నిర్మాణాలు తదితర అ ంశాలపై అధికారులు సర్వే పూర్తయ్యాక పూర్తిస్థాయిలో సమగ్ర ప్రాజెక్ట్ రిపోర్ట్ (డిపిఆర్)ను సిద్ధం చేయనున్నారు. 2014-19 మధ్య సుమారు 260 కోట్లకు పైగా నిధులతో మదనపల్లి - కృష్ణగిరి జాతీయ రహదారి అభివృద్ధి పనులకు సిఎం చంద్రబాబునాయుడు శ ంకుస్థాపన చేయడంతో పాటు అప్పట్లో రెండులైన్ల రహదారి పనులు సైతం దాదాపు పూర్తి చేశారు. ప్రస్తుతం మరలా నాలుగులైన్ల రహదారి విస్తరణకు ఉన్న అవకాశాలపై జాతీయ రహదారుల శాఖ అధికారులు కసరత్తులు మొదలుపెట్టారు. కాగా వి.కోట పట్టణంలో ప్రస్తుతం జాతీయ రహదారి పట్టణం మధ్యలోనుంచే ఉంది. ఈ నేపథ్యంలో నాలుగులైన్ల రహదారిని విస్తరించే పనులు చేపడితే



పలమనేరు - కృష్ణగిరి మధ్య ఉన్న జాతీయ రహదారి (ఫైల్‌ఫోటో)

వి.కోట వద్ద కొత్తగా నాలుగులైన్ల బైపాస్ రోడ్డు నిర్మించాల్సి ఉంది.

### కొత్త బైపాస్‌రోడ్డు కోరుతున్న చెల్దిగానిపల్లి గ్రామస్తులు :

జాతీయ రహదారుల శాఖ అధికారులు రోడ్డు విస్తరణకు ఇటీవల సర్వే చేపట్టిన నేపథ్యంలో రామకుప్పం మండలం చెల్దిగానిపల్లి గ్రామస్తులు కొత్త డిమాండ్‌ను తెరపై తెచ్చారు. నాలుగులైన్ల రహదారి పనులు మొదలుపెడితే తమ గ్రామం వద్ద ఉన్న జాతీయ రహదారిని విస్తరించక కొత్తగా బైపాస్ రోడ్డు నిర్మించాలని చెల్దిగానిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు. ఈమేరకు రెండు రోజుల క్రితమే కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు వినతిపత్రాన్ని సైతం అందించారు. ఒకవేళ నాలుగులైన్ల జాతీయ రహదారి విస్తరణ పనులు చేపడితే మండల కేంద్రం శాంతిపురంలో ఉన్న ప్రజలు

### త్వరలో నివేదిక సిద్ధం చేయనున్న జాతీయ రహదారుల శాఖ !!

సైతం కొత్తగా బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరే అవకాశాలు లేకపోలేదు. శాంతిపురం గ్రామం మొత్తం ప్రస్తుతం ఉన్న జాతీయ రహదారికి అటు, ఇటుగానే ఉంది.

### కుప్పం- నడిమూరు మధ్య బైపాస్ రోడ్డు

నాలుగు లైన్ల రహదారి విస్తరణ పనులు చేపడితే కుప్పం పట్టణంకు కొంత దూరంలో కొత్తగా బైపాస్ రోడ్డు నిర్మించాలని జాతీయ రహదారుల శాఖ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం కుప్పం పట్టణంలోని విజలాపురం సర్కిల్ నుంచి బైరుగానిపల్లి మీదుగా నడిమూరు వరకు కొత్తగా బైపాస్ రోడ్డు నిర్మిస్తే ఎలా ఉంటుందన్న అంచనాకు ఎన్‌హెచ్ అధికారులు వచ్చినట్లు తెలిసింది. ఈ బైపాస్ రోడ్డుకు సైతం అధికారులు భారీగానే భూసేకరణ చేయాల్సి ఉంటుంది. కాగా జాతీయ రహదారుల శాఖ అధికారులు 110కి.మీ.ల మేర విస్తరించాలనుకున్న నాలుగులైన్ల రహదారి విషయంగా సమగ్ర నివేదిక తర్వాత కేంద్రం ఉపరితల రవాణాశాఖ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

# ఎస్వీయూ ఎగ్జామినేషన్ సెక్షన్‌లో అవినీతిపై కొరడా

### కమిటీ సిఫారసు మేరకు పలువురు ఉద్యోగులపై చర్యలు
### ఇప్పటికే ఓ ఉద్యోగిని సెక్యూరిటీ వింగ్‌ను బదిలీ చేసిన అధికారులు



తిరుపతి విద్య, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త
ఎస్వీయూ పరిపాలనా భవనంలోని ఎగ్జామినేషన్ సెక్షన్లో జరుగుతున్న అవినీతిపై వర్సిటీ అధికారులు ఎట్టకేలకు కొరడా జులిపించారు. సర్టిఫికేట్ల జారీ ప్రక్రియలో భాగంగా విద్యార్థుల నుంచి పెద్ద మొత్తంలో నగదు వసూళ్ళు చేసి కొందరు ఉద్యోగులు అవినీతికి పాల్పడినట్లు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంపై యూనివర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ జరిగిన నేపథ్యంలో వర్సిటీ అధికారులు విచారణ కోసం ప్రత్యేక కమిటీని నియమించారు. అధ్యాపకుల ఆధ్వర్యంలో ఏర్పడిన కమిటీ ఎగ్జామినేషన్ సెక్షన్లో జరుగుతున్న అవినీతిపై పూర్తి స్థాయి విచారణ జరిపింది. విచారణలో ఓ ఉద్యోగి వద్ద రెడ్ హ్యాండెడ్గా పెద్ద సంఖ్యలో సర్టిఫికేట్లు దొరకడంతో ఆ ఉద్యోగిని ఎగ్జామినేషన్ సెక్షన్ నుంచి సెక్యూరిటీ వింగ్ కు బదిలీ వేటు వేశారు. దీంతో ఆ సెక్షన్లో జరుగుతున్న అవినీతి భాగోతం పూర్తి స్థాయిలో వెలుగులోకి వచ్చింది.

### ఆరుగురు ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు జారీ

వర్సిటీ ఎగ్జామినేషన్ సెక్షన్లోని పలు విభాగాలకు చెందిన సుమారు ఆరుగురు ఉద్యోగులు అవినీతిలో భాగస్వామ్యులుగా ఉన్నట్లు విచారణ కమిటీ నివేధికలో పేర్కొన్నట్లు సమాచారం. దీంతో కమిటీ నివేధిక ఆధారంగా ఆ సెక్షన్లలో పనిచేస్తున్న ఉద్యోగులకు వర్సిటీ అధికారులు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఇందులో శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. నోటీసులకు సంబంధించి ఉద్యోగుల వివరణ ఆధారంగా వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలుస్తోంది. షోకాజ్ నోటీసులు అందుకున్న వారిలో అంతర్గత బదిలీలలో భాగంగా పలు విభాగాల నుంచి ఎగ్జామినేషన్ సెక్షన్కు బదిలీపై వచ్చిన ఉద్యోగులు కావడం గమనార్హం.

### మరింత సౌలభ్యంగా
# గదుల చెకౌట్ కౌంటర్
### -ఖాళీచేశాక ఇక భక్తులకు తప్పిన నిరీక్షణ

తిరుమల, ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమలకు వచ్చిన భక్తులు గదులు పొందిన తరువాత ఖాళీచేసేందుకు ఆయా అతిథిగృహాలు, విశ్రాంతి గృహాల వద్ద నిరీక్షణ చేయడం తప్పనుంది. ఇందుకోసం టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆదేశాలతో వసతికల్పన విభాగం నూతన ఒరవడికి శ్రీకారం చుట్టింది. ముఖ్యంగా పద్మావతిఅతిథిగృహాల ప్రాంతంలో పలు అతిథిగృహాలు ఉన్నాయి. ఇందులో గదిని పొందిన భక్తులు తిరిగి ఖాళీచేసేందుకు క్యూలలో నిరీక్షణ తప్పడంలేదు. దీన్ని గమనించిన అదనపు ఈఓ చౌదరి మరింత సులభతరం చేయాలని ఆదేశించారు. రిసెప్షన్ డిప్యూటీ ఈఓ భాస్కర్, ఓఎస్‌డి సత్రానాయక్, సూపరింటెండెంట్ భాస్కర్ పద్మావతి విచారణ కార్యాలయంకు సమీపంలో ప్రత్యేకంగా చెక్‌అవుట్ కౌంటర్లు ప్రారంబించారు. బుధవారం సాయంత్రం ఈ కౌంటర్ పనితీరును స్వయంగా పరిశీలించారు.

అసంఘటిత కార్మికులకు సాంఘీక భద్రత
ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఉచితంగా నమోదుకు అవకాశం - కలెక్టర్
4 లో

## ప్రమాద ఘటనను పరిశీలించిన జడ్పీ సీఈఓ

**ఐరాల, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదం జరిగిన ఐరాల మండల ప్రభుత్వ కార్యాలయాలను జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడు బుధవారం పరిశీలించారు. బుధవారం సీఈఓ రవికుమార్ నాయుడు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగిన కార్యాలయాలను పరిశీలించి, జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట చిత్తూరు డీఎల్‌డీఓ రవికుమార్, ఐరాల మండల కార్యాలయాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రీసర్వే ప్రాజెక్ట్ పనులను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

**తవణంపల్లె, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:**

మండలంలో జరుగుతున్న భూముల రీసర్వే ప్రాజెక్ట్ పనులను జిల్లా ట్రైనీ కలెక్టర్ హిమాంశు శుక్లా బుధవారం పరిశీలించారు. ఈ మేరకు మండలంలోని చెర్లోపల్లె గ్రామ పంచాయతీలో జరుగుతున్న భూముల రీసర్వే పనులను ఆయన అధికారులతో కలసి పరిశీలించారు. ఈసందర్భంగా రీసర్వేను పగడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఆయా గ్రామాల సర్వే పటాలను, సరిహద్దు రాళ్ళను ట్రైనీ కలెక్టర్ పరిశీలించారు. ఆయన వెంట చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, తవణంపల్లె తహశీల్దార్ సుధాకర్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఇదిలా వుండగా చిత్తూరు ఆర్డీఓ తవణపల్లె తహశీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అలాగే రెవెన్యూ పరమైన సమస్యలపై విఆర్‌ఓలతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు, ఈకార్యక్రమంలో తహశీల్దార్ సుధాకర తదితరులు పాల్గొన్నారు.

## కోడిగ్రుడ్డు, మాసంపై ఆపోహలు వద్దు

– పశుసంవర్ధకశాఖ జెడి డాక్టర్ ప్రభాకర్

**చిత్తూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కోడిగ్రుడ్లు, మాంసంపై ఎలాంటి అపోహలు వద్దని పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ప్రభాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వైరస్ వ్యాధిని గోదావరి జిల్లాలో నిర్ధారించడం దృష్ట్యా జిల్లాలో పశుసంవర్ధకశాఖ ముందస్తు చర్యగా స్థానిక పశుసంవర్ధకశాఖ వైద్యాధికారులతో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాలో ఎలాంటి బర్డ్ ఫ్లూ వ్యాధి లేదని, జిల్లాలోని కోళ్ళలో ఎలాంటి అసాధారణ మరణాలు నమోదు కాలేదని పశువైద్యాధికారులు నిర్ధారించడం జరిగిందన్నారు. అలాగే ముందస్తు వ్యాది నిరోధక చర్యల్లో భాగంగా జిల్లాలోని కోళ్ళ రైతులను తగు నివారణ చర్యలు చేపట్టి వ్యాధి వ్యాపించకుండా జాగ్రత్తలు వహించాలని సూచించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుండి కోళ్ళ రవాణా విషయంగా స్థానిక చెక్‌పోస్టు సిబ్బందిని అప్రమత్తం చేయడం జగిందన్నారు. కోడి గ్రుడ్డు, మాంసం బాగా ఉడికించి వినియోగించడం వల్ల ఎలాంటి అనారోగ్య సస్యలు తలెత్తినట్లు ఏ సంస్థలు, శాఖలు ధృవీకరించలేదన్నారు. అలాగే బర్డ్ ఫ్లూ వ్యాధిపై అపోహలు, ఆందోళనలను నివృత్తి చేయడానికి పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో ఉన్నత అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

## కొనసాగుతున్న అక్రమ మట్టి తరలింపు దందా

– రెండు ట్రిప్పర్లు సీజ్ చేసిన డిఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్

**పాలసముద్రం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** పాలసముద్రం మండలం నుండి తమిళనాడుకు అక్రమ మట్టి తరలింపు దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. నేరాల కట్టడి చేయడానికి ప్రజల్లో అవగాహన కల్పించడానికి పల్లె నిద్ర కార్యక్రమానికి మండలానికి వచ్చిన నగరి డిఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్‌కు ఎలాంటి బిల్లులు లేకుండి అక్రమంగా తమిళనాడుకు మట్టి తరలిస్తున్న రెండు ట్రిప్పర్లు పట్టుబడ్డాయి. మండలంలోని నరసింహపురం పంచాయతీలో మంగళవారం రాత్రి పల్లె నిద్ర కార్యక్రమం ముగించుకుని సబ్ డివిజన్‌కు తిరుగు ప్రయాణం అయ్యే సమయంలో వనదుర్గాపురం పంచాయతీలోని ఓ క్వారీ నుండి రెండు ట్రిప్పర్లు అర్ధరాత్రి 1 గంటల సమయంలో మట్టి తరలిస్తుండగా డిఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ ట్రిప్పర్లను తనిఖీ చేశారు. ట్రిప్పర్లలో మట్టి వుండటంతో ట్రిప్పర్ డ్రైవర్లను బిల్లులు అడిగితే తమకు తెలివని చెప్పడంతో రెండు ట్రిప్పర్లను సీజ్ చేయాల్సిందిగా ఎస్ఐ చిన్నప్పరెడ్డి ను ఆదేశించారు. ఈ మేరకు ఎస్ఐ చిన్నప్పరెడ్డి రెండు ట్రిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్ళారు. ఈ రెండు ట్రిప్పర్లకు మట్టి తరలించడానికి బిల్లులు వున్నాయని ట్రిప్పర్ ఓనర్లు చెప్పడంతో విచారించి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చిన్నప్పరెడ్డి పేర్కొన్నారు.

## కాయర్ బోర్డు ద్వారా మహిళలకు స్వయం ఉపాధి

**పాలసముద్రం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు కాయర్ బోర్డు ద్వారా స్వయం ఉపాధి కలుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు వెళ్ళాలని కాయర్ బోర్డు రీజినల్ ఆఫీసర్ దుర్గాదాస్ అన్నారు. పాలసముద్రం ఎంపిడిఓ కార్యాలయంలో కాయర్ బోర్డు, రూరల్ యాక్షన్ సంస్థ ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు కాయర్ ఉత్పత్తులపై శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమానికి హాజరైన సంస్థ రీజినల్ మేనేజర్ దుర్గాదాస్ మాట్లాడుతూ కాయర్ ఉత్పత్తుల ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చునన్నారు. దీనికి అవసరమైన శిక్షణను కాయర్ బోర్డు సంస్థ ఇస్తోందన్నారు. ఎంపిడిఓ మహేష్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే కాయర్ బోర్డు శిక్షణ పొందిన మహిళలు స్వయంగా అభివృద్ధి చెందాలన్నారు. రూరల్ యాక్షన్ సంస్థ సెక్రటరీ చిట్టిబాబు మాట్లాడుతూ తమ సంస్థ మహిళల స్వయం ఉపాధి కోసం పోరాటం సాగిస్తుందన్నారు. బ్యాంకు మేనేజర్ వినోద్‌కుమార్ మాట్లాడుతూ బ్యాంకు రుణాలకు అర్హులైన మహిళలను గుర్తించి వారికి రుణాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి ఛైర్మన్ శివప్రకాష్‌రాజు, కాయర్ మార్డు నుండి వినోద్, కోటేశ్వరరావు, ప్రోగ్రాం అనలిస్టు శాలిని, ఫ్యాకల్టీలు శ్రీలత, పద్మావతి, హర్షకుమార్, పలువురు సర్పంచ్‌లు పాల్గొన్నారు.



## ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

**బంగారుపాళ్యం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** బంగారుపాళ్యం రాజావీధిలో వెలసిన గ్రామ దేవత ముత్యాలమ్మకు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నిర్మించి 13 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా ఆలయ వార్షికోత్సవ పూజలు ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించి వివిధ పుష్పాలతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అలాగే ఆలయ ఆవరణలో వేద పండితుల మంత్రోఛ్చారణ నడుమ హోమాలు, కలశ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఇందులో ఆలయ ధర్మకర్త ఎంబి కృష్ణమూర్తి, సర్పంచ్ ఎంబి ఉమాదేవి, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు మురళీ గురుకుల్ తదితరులు పాల్గొన్నారు.

## తవణంపల్లెలో ప్రత్యేకాధికారి విస్తృత తనిఖీలు

**తవణంపల్లె, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:**



మండల ప్రత్యేకాధికారి బాలాజి బుధవారం మండలంలో విస్తృతంగా పర్యటించి తనిఖీలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేకాధికారిగా నియమితులైన బాలాజి మండలంలోని ప్రభుత్వ బాలురు, బాలికోన్నత పాఠశాలలు, దిగువమాఘం, అరగొండ, టి.పుత్తూరు అంగన్‌వాడి కేంద్రాలను సందర్శించారు. ఈసందర్బంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యా ర్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం పథకంను ఆయన పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన శుచి, శుభ్రతతో కూడిన భోజనాన్ని మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలని మధ్యాహ్న భోజన సిబ్బందికి సూచించారు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ఈయన వెంట ఎంపీడీఓరెడ్డి బాబు, ఐరాలసీడీపీఓ జి.నిర్మల సూపర్‌వైజర్ లావణ్యలతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## 15 వరకు బిసీ రుణ దరఖాస్తులకు గడువు

**చిత్తూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** బిసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తుల గడువును ఫిబ్రవరి 15వ తేదీ వరకు పెంచినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఓ ప్రటకనలో తెలిపారు. అర్హులైన వారందరు సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని భావించి ప్రభుత్వం బిసీ, ఈడబ్ల్యుఎస్, కాపు సహా వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న రుణ యూనిట్ల దరఖాస్తు

## ఈచర్ వాహనం బోల్తా : తప్పిన ప్రమాదం

**వెదురుకుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఈచర్ వాహనం వేగం అదుపుతప్పి బోల్తా పడిన సంఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ సమీపంలో బుధవారం తెల్లవారుజామున వరి ధాన్యంతో వెళ్ళుతున్న ఈచర్ వాహనం వేగం అదుపుతప్పి బోల్తా పడటంతో ప్రమాదం సంభవించింది. ఐతే ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం తప్పించబోయి ప్రమాదం జరిగిన్నట్లు చెపుతున్నారు. కాగా డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డారు. వాహనం బాగా దెబ్బతిన్నది. సంఘటన పై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

## ఆర్‌టిసి బస్సు ఆలయం గోడకు ఢీ



**వెదురుకుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** ఆర్‌టిసి బస్సు పచ్చికాపల్లం పేట మలుపు వద్ద ముత్యాలమ్మ ఆలయం ప్రహరీ గోడకు ఢీ కొనడంతో ప్రయాణికులు భయభ్రంతులకులోనైనారు. పెనుప్రమాదం తప్పడంతో ప్రయాణికులు ఊరిపీల్చుకున్నారు. తిరుపతి డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సు కార్వేటినగరం పళ్ళిపట్టు మీదుగా తిరుపతికి వెళ్ళుతున్న బస్సు అని తెలిపారు. టైర్ బరెస్టు కావడంతో వేగం అదుపుతప్పి గోడకు ఢీ కొనడంతో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలు కావడం జరిగింది. అదుపుతప్పివుంటే ప్రక్కనగల గుంటలో పడివుండేదని అప్పుడు పెనుప్రమాదం జరిగిందన్నారు.

## నేడు కుప్పంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్

**కుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**



కుప్పం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్‌ఎస్) కార్యక్రమంను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. ఉదయం 10గంటలనుంచి మధ్యాహ్నం 1గంట దాకా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యల పరిష్కారానికై ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమానికి మండల, నియోజకవర్గ స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

## కొత్తపేటలో డ్రైనేజీల నిర్మాణానికి కొలతల సేకరణ



**కుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** కుప్పం మున్సిపల్ పరిధి కొత్తపేటలో నూతన డ్రైనేజీల నిర్మాణానికి సంబంధించి బుధవారం స్థానిక నేతలు, అధికారులు కొలతల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా కొత్తపేట ఇన్‌చార్జ్ ముఖేష్ (అప్పు) మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నంల ఆదేశాలతో మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జ్ సత్యేంద్రశేఖర్ సూచనలతో 14,15 వార్డుల్లో కొత్తగా డ్రైన్లు, రోడ్ల నిర్మాణానికి సర్వే చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో బూత్ ఇన్‌చార్జ్ ఉదయ్ వడయార్, నేతలు రాహుల్‌కుమార్, సుకుమార్, మురళి పాల్గొన్నారు.

## వైకాపా సర్పంచులు..ఎంపిటిసిలతో జడ్పీఛైర్మన్ సమావేశం

**కుప్పం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** కుప్పం మండలంకు చెందిన పలువురు వైకాపా సర్పంచులు, ఎంపిటిసిలతో బుధవారం జడ్పీఛైర్మన్ శ్రీనివాసులు సమావేశమయ్యారు. స్థానిక మండల కార్యాలయంలో ఎంపిపి హెచ్‌ఎం అశ్విని ఛాంబర్‌లో ప్రజాప్రతి నిధులను కలసి చర్చించారు. గ్రామాల్లో ప్రస్తుతం పార్టీ పరిస్థితులు, పంచాయతీల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై అడిగి తెలుసుకున్నారు. జడ్పీనిధులతో మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జడ్పీటిసి ఎడిఎస్ శరవణ, ఎంపిపి అశ్విని, మాజీ సర్పంచ్ ఈశ్వర్, మున్సిపల్ రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్, కౌన్సిలర్లుమోహన్‌రాం, నాగరాజు, రాజ్‌కుమార్, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.



## కలసికట్టుగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం

– ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం



**శాంతిపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** పార్టీ నేతలు, కార్యకర్తలు కలసికట్టుగా పనిచేసి శాంతిపురం మండలాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర నేత డా॥ బిఆర్ సురేష్‌బాబు సూచించారు. బుధవారం స్థానిక బాలాజీ కళ్యాణ మండపంలో మండల టిడిపి అధ్యక్షుడు విశ్వనాథనాయుడు అధ్యక్షతన జరిగిన తెదేపా సర్వసభ్య సమావేశంలో వారు ప్రసంగించారు. కుప్పం ప్రజల సమస్యల పరిష్కారంకు సిఎం చంద్రబాబునాయుడు ప్రారంభించిన జననాయకుడు పోర్టల్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కాగా కార్యకర్తలు మాట్లాడుతూ పార్టీలో ఉన్న విబేధాలను నేతల దృష్టికి తెచ్చారు. నేతలు విబేధాలు పక్కనపెట్టి పనిచేయాలని డా॥ సురేష్‌బాబు సూచించారు. సమావేశంలో నేతలు జనార్ధనరెడ్డి, ఉదయ్, ఎల్.జయరాంరెడ్డి, చలపతి, నాగరాజు, ఉయ్యాలజయరాంరెడ్డి, చంద్ర, రమేష్, నామాలప్ప, రాజు, మురుగన్, మురళి, బసవరాజు, సుగుణమ్మ, చంద్రకళ, పుష్ప, శకుంతల పాల్గొన్నారు.

## రైతులు విశిష్ట గుర్తింపు కార్డులు పొందాలి



**కుప్పంరూరల్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** ప్రభుత్వ పథకాల్లో లబ్ధి కలగాలంటే రైతులు తప్పక ప్రభుత్వం అందించే విశిష్ట గుర్తింపు కార్డులు పొందా లని వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా సూచిం చారు. బుధవారం చెక్కునత్తం రైతు సేవా కేంద్రంలో రైతులకు అవగాహన కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్బంగా రైతులకు వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీలు వివరించారు. ఈనెల 22లోగా విశిష్ట గుర్తింపు కార్డులకోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో తెలుగుయువత రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి చెక్కునత్తం మణి, నేతలు దేవేంద్ర, మునిరత్నం ఆచారి, తిమ్మప్ప, బీరప్ప, వెంకటాచలం, బాలు, రామప్ప, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

## 5వ తరగతి, ఇంటర్మీడియేట్ విద్యకు విద్యార్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానం

**చిత్తూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం విద్య అభ్యసించడానికి అర్హులైన విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు చిత్తూరు జిల్లా సమన్వయ అధికారి గీత ఓ ప్రకటనలో తెలిపారు. బాలురు, ఇంగ్లీషు మీడియంలో బాలురు, బాలికల కోసం ప్రవేశ పరీక్ష నిర్వహించి ఎంపికలు చేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు మార్చి 6వ తేదీ మధ్యాహ్నం 12 గంటలలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతి ప్రవేశ విద్యార్థులకు ప్రవేశ పరీక్ష ఏప్రిల్6వతేదీఉదయం10నుండి12గంటల వరకు, ఇంటర్మీడియేట్ మొదటి సంవత్సరం ప్రవేశా నికి అదే రోజు మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు జరుగుతుందన్నారు. బాలికలు ప్రవేశపరీక్షకోసం చిత్తూరుకు సంబంధించి 97045 50109, జిడినెల్లూరు 99892 11885, పలమనేరు

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ఎన్‌విఆర్ ట్రస్ట్‌చే ఆర్తులకు ఆర్థిక సాయం



**పుంగనూరు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త** మండలంలోని చదళ్లకు చెందిన ప్రముఖ సేవా సంస్థ ఎన్.వి.ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పలువురు ఆర్తులకు ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు మరియు జనసేన నాయకులు డాక్టర్ ఎన్.వేణుగోపాల్ రెడ్డి బుధవారం ఆర్థిక సాయం అందజేశారు. పులిచెర్ల మండలం కురవపల్లి లో ఆలయ నిర్మాణానికి రూ.10వేలు, పుంగనూరు పట్టణంలోని శాంతినగర్లో ఆంజనేయ స్వామి ఆలయానికి రూ.10 వేలు, పుంగనూరు మండలం ముడి పాపనపల్లి ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికిరూ.10 వేలు, గుట్ట కిందపల్లె ఆలయ నిర్మాణానికి 50 సిమెంట్ బస్తాలు, మోదుగులపల్లి వికలాంగుడు నారాయణప్పకు రూ.10 వేలు, పోలీస్ లైన్ లో హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న రేష్మకు రూ.5 వేలు, వడ్డి వారి పల్లి లో అనారోగ్యంతో బాధపడుతున్న సరస్వతమ్మకు రూ.5 వేలు, చదళ్ల గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి వెంకటపతికి రూ.10 వేలు, లద్దిగం గ్రామానికి చెందిన ఐదవ తరగతి విద్యార్థి భాగ్యమ్మకు చదువుల నిమిత్తం రూ.5వేలు వంతున ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎన్విఆర్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి శివ కుమార్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, నారాయణరెడ్డి, విరూపాక్ష, నియోజకవర్గ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ చిన్నా రాయల్, పగడాల రమణ, నరేష్ రాయల్, సుబ్బు ట్రస్టు సభ్యులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## శ్రద్ధా దీక్షలతో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం

**పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త** పట్టణంలోని శ్రీ కళ్యాణ వెంకటరమణ స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి విచ్చేసిన భక్తులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతంలో పాల్గొన్నారు. అర్చకులు వ్రత కథ యొక్క వృత్తాంతాన్ని చదివి వినిపించారు. అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.





## శివయ్యకు పౌర్ణమి పూజలు

**పుంగనూరు రూరల్, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త**

మాఘమాస పౌర్ణమి పర్వదినం సందర్భంగా పుంగనూరులోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక పుష్కరిణి వద్ద గల శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు జరిగాయి. లింగానికి ఏకదశ వార రుద్రాభిషేకం, క్షీరాభిషేకం, పసుపు, విభూతితో అభిషేకించారు. తర్వాత అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పరమేశ్వరుని దర్శించుకున్నారు.

## ఐదు పాడి పశువుల చోరీ

**సోమల, జనవరి 12, ప్రభాతవార్త**



కందూరు పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి ఐదు పాడిపశువులు సిని పక్కిలో చోరీకి గురవడం స్థానికంగా కలకలం రేపింది. కందూరు జిల్లా పరిషత్ హై స్కూల్ వద్ద రామచంద్రారెడ్డి అనే రైతు రెండు పాడి పశువులను రాత్రి రెండు గంటల ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. అలాగే కోనేటి పాలెం కు చెందిన విజయ్‌కు చెందిన అదే సమయంలో చోరీ చేశారు. పశువుల విలువ రెండు లక్షలకు పైబడి ఉంటుందని బాధితులు తెలిపారు. అలాగే తమ్మి నాయన పల్లికి చెందిన రత్నయ్య పాడిపశువులను రాత్రి ఒంటిగంట ప్రాంతంలో చోరీ చేశారు. పశువు విలువ 70 వేల విలువ చేస్తుందని బాధితుడు తెలిపారు. పేగలవారిపల్లి చెందిన మల్లయ్య భార్య పశువులు అరుస్తుండగా లేచి చూసి దొంగలు దొంగలు అని గట్టిగా అరిచింది. నాలుగు చక్రాల వాహనంలో బలవంతంగా పశువుని ఎక్కించుకొని మితిమీరిన వేగంతో కందూరు వైపు వాహనం వెళ్ళింది. వీరు సోమల పోలీసులకు బుధవారం ఉదయం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివశంకర్ ఘటన స్థలాన్ని సందర్శించి పలు కోణాల్లో కేసు దర్యాప్తు చేస్తున్నారు

## రోగులకు ఓర్పుతో వైద్యం చేయండి



**సోమల, జనవరి 12, ప్రభాతవార్త** పభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఓర్పుతో వైద్యం చేసి వారి మన్ననలు పొందాలని మండల స్పెషల్ ఆఫీసర్ ద్వామా అడిషనల్ పీడీ మల్లికార్జున అన్నారు. మండలంలో పలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయన సందర్శించారు. సోమల ప్రభుత్వ వైద్యశాలలో ఆయన తనిఖీ నిర్వహించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. సోమల, ఇరికిపెంట, ఎస్ నడింపల్లి, నంజంపేట అంగన్వాడి సెంటర్లను పరిశీలించి గర్భవతులకు అందించే పౌషిక ఆహారం గురించి అడిగి తెలుసుకున్నారు. సోమల జిల్లా పరిషత్ హైస్కూల్ సందర్శించి ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను, కలుసుకొని పలు సమస్యలు గూర్చి చర్చించారు. కార్యక్రమంలో ఏపీవో దినకర బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలి

– శ్రీ తలకోన సిద్దేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే పులివర్తి నాని సమీక్ష

**యర్రావారిపాలెం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త**



తలకోన శ్రీ సిద్దేశ్వర స్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవ వేడుకలలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. బుధవారం అధికారులతో, కూటమి ప్రభుత్వ నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆలయ అధికారులు అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న కోనేరును పరిశీలించారు. ఈ నెల 23 నుండి 27 వరకు బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించాలని కోరారు. ఆలయానికి అనంతరం బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవో మమత, ఎంపీడీవో అరుణ, ఎమ్మార్వో పరమేశ్వర స్వామి, ఎస్సై డివై స్వామి, మండల అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు, పార్లమెంటు కార్యదర్శి మధు, యూత్ ప్రెసిడెంట్ నిరంజన్, చిత్తూరు పార్లమెంట్ కన్వీనర్ మల్లారి దేవి, మహిళా అధ్యక్షురాలు లక్ష్మిదేవి, ఉపాధ్యక్షురాలు శివ రాణి, మండల ఎస్టి సెల్ అధ్యక్షుడు కుంభ నాగరాజ, రైతు కార్యదర్శి ప్రసాద్ నాయుడు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ చిన్నప రెడ్డి, కేశవులు నాయుడు, జైపాల్ రెడ్డి, జీవన్ నాయుడు, ఆలయ అధికారులు, మండల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానికులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలకు యూనిక్ కోడ్

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి..! ఏఓ విజయభాస్కర్

**చంద్రగిరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:**



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు రైతులకు అందించే లక్ష్యంతో కేంద్రం యూనిక్ కోడ్‌ను అందించేందుకు నిర్ణయించినట్లు ఏఓ విజయభాస్కర్ తెలిపారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలు బుధవారం రైతులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రైతులను గ్రూపులుగా చేసి ప్రతి రైతుకు ఆధార్ కార్డు మాదిరిగా 11 నంబర్లతో గుర్తింపు సంఖ్యను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇందు కోసం ప్రతి రైతు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అన్నారు. రైతులు సబ్సిడీ రుణాలు, పంటల భీమా, పి.ఎం.కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి కార్యక్రమాలకు పొందడానికి ఈ కార్డును అనుసంధానం చేయనున్నట్లు తెలిపారు. మీ సమీప రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.

## పురస్కార గ్రహీతలకు ఘనసత్కారం



**.తొట్టంబేడు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలంలో పనిచేస్తూ విధి నిర్వహణలో ఉత్తమ అవార్డు అందుకున్న అధికారులు మరియు ఉద్యోగులను యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సంస్థ కార్యాలయంలో సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. సంస్థ అధ్యక్షులు హేమకుమార్ ఆధ్వర్యంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో శ్రీకాళహస్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి రఫీఖాన్, తొట్టంబేడు ఎంపిడిఓ సురేంద్రనాథ్‌రెడ్డి, డ్రగ్ ఇన్స్పెక్టర్ ప్రశాంతి, యూనియన్ బ్యాంకు మేనేజర్ హరికృష్ణ, న్యాయవాది వీరరాఘవరెడ్డి, సాంఘిక సంక్షేమ వసతిగృహాల అధికారులు విజయకుమారి, ఆనందరావు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సిఈఓ చిరంజీవులురెడ్డి, వ్యవసాయశాఖ అసిస్టెంట్ బాలునాయక్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. కార్యక్రమంలో యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## అబాకస్ మరియు వేదిక్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



**తొట్టంబేడు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** ఆదిత్య లెర్న్ టెక్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ జిల్లా స్థాయిలో నిర్వహించిన అబాకస్ మరియు వేదిక్ గణితం పోటీల్లో గెలుపొందిన విజేత పాఠశాల విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ కాయం సుబ్బరామిరెడ్డి విద్యార్థులను అభినందించారు. అబాకస్ భాగంలో రెండో తరగతికి చెందిన దేగ ముని మనోహర్, నాలుగో తరగతికి చెందిన ఆర్. మహదేవ్ మరియు వేదిక్ మ్యాథ్స్ విభాగంలో బి. ఈషాదక్షిత ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని రాష్ట్రసాయి పోటీలకు ఎంపికైనందుకు మరియు ద్వితీయ, తృతీయ స్థానాలకు ఎంపికైన ఎ.బి.డిల్లీనాద్, సిహెచ్.గిరీషాలకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ రామ్ ఉమాసింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

**తొట్టంబేడు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** మండలంలోని ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తహశీల్దార్‌మధుసూధనరావు తెలిపారు. ప్రతి ఒక్కరు తొట్టంబేడు మండలంలో ఉన్న విలువైన భూములపై కొందరు రియల్‌వ్యాపారులు కన్నేసి దొరికొంది దోచుకుంటున్నారు. డికెటి భూముల్లో వెంచర్లు వేసి ఎంచక్కా విక్రయించేసి జేబులు నింపుకుంటున్నారు. దీంతో బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో విఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లు, సిబ్బందితో తహశీల్దార్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో 41 రెవెన్యూ గ్రామాల్లో ఎక్కడైనా ఆక్రమణలకు గురైతే వాటదిని కాపాడాల్సిన బాధ్యత విఆర్‌ఓలు, సర్వేయర్లపై ఉందన్నారు. ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకే ఎంఎల్‌ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటికే శివనాథపాళెం రెవెన్యూ పరిధిలోని 149/1, 149/2లో మొత్తం 6.17 ఎకరాల్లో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. అంతేకాకుండా రామచంద్రాపురం గ్రామంలో సర్వే.నం.89/1బిలో బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. ప్రతిశనివారం మండలంలో ఆక్రమణల గుర్తించి వాటిని తొలగిస్తామన్నారు. ప్రస్తుతం గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందని తిరిగి రీసర్వే చేస్తున్నారని దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఎస్‌ఓ మధు విఆర్‌ఓలతో సమావేశాన్ని నిర్వహించి పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ జగన్‌మోహన్, సీనియర్ అసిస్టెంట్ నారాయణస్వామి, విఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## నేత్రాలు దానం చేయడానికి ముందుకొస్తున్న కుటుంబ సభ్యులు



**తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :** రుయా ఆస్పత్రిలో చనిపోయిన తర్వాత నేత్రాలు దానం చేయడానికి మృతుల కుటుంబ సభ్యులు ముందుకొస్తున్నట్లు రుయా కంటి విభాగం విభాగాధిపతి డాక్టర్ చలపతిరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్వీ వైద్య కళాశాల రుయా ఆస్పత్రిలో ఎం.లీలావతి(61) గుండె పోటుతో చికిత్స పొందుతూ మరణించారు. ఎం. లీలావతి కుమారుడు ఎం. సిద్ధారెడ్డి తన తల్లి నేత్రాలను దానం చేయడానికి ముందుకు రావడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మరికొంత మంది మృతులు నేత్రాలు, అవయవ దానాలకు ఇవ్వడానికి ముందుకు రావడం వలన పేద రోగులకు ప్రాణప్రాయ స్థితిలో ఉన్న రోగులకు ఈ అవయవాలు వారికి ఉచితంగా అమర్చడం వలన ఎంతో ఉపయోగకరంటుందని తెలిపారు. పుర ప్రజలు ఎవరైనా నేత్రాలు, అవయవదానాలు చేయాలనుకుంటే 8500880126ను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఐ బ్యాంక్ టెక్నీషియన్‌ఎస్.రమేష్, ఎల్విప్రసాద్, ఎస్.వివైద్య కళాశాల పీఆర్వో వీర కిరణ్. తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు అన్నదానం



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** పట్టణంలోని వైఎస్ఆర్ సర్కిల్ వద్ద నియోజకవర్గ కాపు సంఘ అధ్యక్షులు గరికపాటి చంద్ర ఆధ్వర్యంలో మాజీ కౌన్సిలర్, మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు కంఠా ఉదయ్‌కుమార్ పుట్టినరోజు వేడుకలను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరుతారక శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం నిరుపేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బలిజ అధ్యక్షుడు ఉప్పుకృష్ణయ్య, కోళ్ళూరుహరనాధ్‌నాయుడు, గిరిప్రసాద్‌గౌడ్, పాలమంగళంరవి, ఆవులశ్రీనివాసులు, సుందరేష్, జాజాల వేణు తదితరులు పాల్గొన్నారు.

## 19నుండి కపిలేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



**తిరుపతి,ఫిబ్రవరి 12ప్రభాతవార్త:** టిటిడికి అనుబంధంగా ఉన్న ప్రసిద్ద శైవాలయం కపిలేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 19వతేదీనుండి వార్షిక బ్రహ్మోత్సవాలు మొదలుకానున్నాయి. ఈనెల 26వతేదీ బుధవారం మహాశివరాత్రి పర్వదినం వేడుకలు అంగరంగ వైభవంగా జరగనుంది. కపిలేశ్వరస్వామి ఆలయంలో పదిరోజుల పాటు 28వతేదీ వరకు ఉదయం,రాత్రి వాహనసేవలు ,భజన కార్యక్రమాలు జరుగుతాయి. ధ్వజారోహణం, రాత్రి హంసవాహనం, సూర్యప్రభవాహనం, రాత్రి చంద్రప్రభవాహనం, భూతవాహనం, సింహవాహనం, మకర వాహనం, శేషవాహనం, తిరుచ్చి ఉత్సవం, అధికార నందివాహనం, 28న చివరగా త్రిశూలస్నానం, సాయంత్రం ధ్వజావరోహణం,రాత్రి రావణాసుర వాహనం తో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, ఆలయంలో చేపట్టాల్సిన అలంకరణలు, పనులపై బుధవారం జెఈఓ వీరబ్రహ్మం అధికారులతో సమీక్షించారు.

## పంచాయతీని శుభ్రంగా ఉంచండి.

.. రేణిగుంట ఫిబ్రవరి 12 ప్రభాతవార్త

రేణిగుంట మేజర్ పంచాయతీని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి ఆదేశాల మేరకు పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శి మణి ఒక ప్రకటనలో తెలిపారు. వీధులను, కాలువలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. ప్రతి ఇంటి వద్ద పొడి చెత్త, తడి చెత్త సేకరించడానికి బుట్టలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తప్పనిసరిగా చెత్త అందులో వుంచి పంచాయతీ వాహనాలు వచ్చినప్పుడు వాటిలో వేయాలన్నారు.ఎవరైతే చెత్తను ఎక్కడపడితే అక్కడ వేస్తే జరిమానా కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

## రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నాం.... రామ్మోహన్

***రేణిగుంట ఫిబ్రవరి 12 ప్రభాతవార్త*** చిలుకూరు శ్రీ బాలాజీ దేవస్థానం ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై జరిగిన దాడిని ఖండిస్తున్నట్టు రేణిగుంట మండల బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు రామ్మోహన్ అన్నారు. ఇలాంటి దాడులు పునరావతం కాకుండా ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకోవాలన్నారు. దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## బీఈడీ ఫలితాలు విడుదల

**తిరుపతి విద్య, ఫిబ్రవరి 12 ప్రభాత వార్త** ఎస్వీయూ పరిధిలో గత ఏడాది నవంబర్ లో జరిగిన బీఈడీ నాల్గవ సెమిస్టర్ ఫలితాలను బుధవారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఎం దామ్లానాయక్ ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్సైట్ ను సంప్రదించాలని సూచించారు.

## 'మంచిప్రవర్తనతో మెలిగితే కేసులు ఎత్తివేస్తాం



**కార్వేటినగరం,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** కసులున్న నేరస్తులు మంచి ప్రవర్తనతో మెలిగి సమాజానికి మేలు చేయాలని దృక్పదం కలిగివున్న వారిని,చట్టవ్యతిరేక పనులు చేసే వారి సమాచారం అందించే వారిపై వున్న కేసులను ఎత్తివేస్తామని నగరి డియస్పి సయ్యద్ మహమ్మద్అజీజ్ తెలిపారు. కార్వేటి నగరం సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాలైన పాలసముద్రం,యస్.ఆర్. పురం, వెదురుకుప్పం,కార్వేటినగరం మండలాల్లోని నేరచరిత్ర కలిగిన వారిని పిలిపించి మంచి చెడులపై వారికి కౌన్సిలింగ్ ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో సర్కిల్ ఇన్స్పెక్టర్ హనుమంతప్ప,ఎస్ఐలు పి.రాజ్‌కుమార్,వెంకటసుబ్బయ్య,సుమన్,చిన్నిరెడ్డెప్ప,ఎఎస్ఐ మునికృష్ణ,పోలీసులు పాల్గొన్నారు.

## పాఠశాలకు పూర్వవిద్యార్థి అపూర్వ వితరణ



**చంద్రగిరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** తాను ఓనమాలు నేర్చుకున్న ప్రాథమిక పాఠశాలకు అపూర్వ వితరణ చేసిన పూర్వ విద్యార్థి బైరెడ్డి భానుప్రకాష్ ఔరా అనిపించుకున్నారు. మండల పరిధిలోని దోర్నకంబాల ప్రాథమిక పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యశించిన భానుప్రకాష్ రూ.5.50 లక్షలు వెచ్చించి విద్యార్థులకు అవసరమైన 25 బెంచీలు, 10 కంప్యూటర్లు, 10 కంప్యూటర్ టేబుళ్ళు, 10 కుర్చీలు, పాఠశాలకు సిసి కెమెరాలు బుధవారం ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. విద్యావంతులై సమాజ సేవకు దోహదపడాలన్నారు. మన స్కూల్ అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. అనంతరం ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, ఉపాధ్యాయులు పి.రామకృష్ణారెడ్డి, వి.ఎ.సంధ్యాలక్ష్మి, కె.రాజేంద్ర, ఆర్.ఎల్. ఉమ,కె.అనూష,బి.గురవమ్మ, విద్యార్థులతో కలసి దాతను ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు.

## సమన్వయంతో ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీ



**చంద్రగిరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** ఉపాధిహామీ పనుల సామాజిక తనిఖీలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పాలుపంచుకోవాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ (ఎస్ఆర్పి) పి.రవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 2023 ఏప్రిల్ నుండి 2024 మార్చి వరకు జరిగిన ఉపాధిహామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీలో విధులు నిర్వహించనున్న స్టేట్ రిసోర్స్ పర్సన్, జిల్లా రిసోర్స్ పర్సన్స్‌ను ఎంపిపి, జడ్పీటిసి, ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సమన్వయ పరిచేందుకై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి పనులను సమన్వయంతో పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, ఎంపిడిఓ శేఖర్, ఏపిఓ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మారెడ్డి కుటుంబానికి సిఎం ఆర్థిక సహాయం



**చంద్రగిరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:** గంగుడుపల్లికి చెందిన సి.ధర్మారెడ్డి కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.62 వేలు చెక్కును బుధవారం ఎంఎల్ఏ పులివర్తి నాని అందజేశారు. అనారోగ్యం కారణంగా ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్న ధర్మారెడ్డి కుటుంబ స్థితిగతులను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్ళి ఆర్థిక సహాయం కోరారు. దీనిపై స్పందించిన సిఎం రూ.62 వేలు మంజూరు చేశారు. ఆర్థిక సహాయాన్ని అందుకున్న ధర్మారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా సిద్దులయ్యస్వామి వార్షికోత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



పట్టణంలోని కొండమిట్టలో కైలసగిరుల్లో వెలసిన మహిమాన్వితమైన సిద్దులయ్యస్వామి 52వ వార్షికోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ముఖ్యఅతిధిగా బిజెపి జాతీయ కార్యదర్శి కోలా.ఆనందకుమార్ విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం విశేషాలంకరణ చేపట్టారు. అనంతరం స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. స్థానిక బేరివారి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాలను పర్యవేక్షించిన వారిలో ఈగబాబు, అంజూరు రాజు, మెకానిక్‌రెడ్డి, చిలకామురళీలతో పాటు మిత్రబృందం పర్యవేక్షించారు.

## వైభవంగా రథ సప్తమి కల్యాణోత్సవం

**నగరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** పట్టణ పరిధిలో టిటిడీ ఆధీనంలోని కరియమాణిక్యస్వామి ఆలయంలో బుధవారం రథసప్తమి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం అభిషేకం, తోమాలసేవ నిర్వహించారు. తదుపరి శ్రీదేవి, భూదేవి సమేత కరియమాణిక్యస్వామి ఉత్సవమూర్తులకు వైభవంగా తిరుమంజనం సేవ నిర్వహించారు. సాయంత్రం కల్యాణోత్సవ వేడుకలు నిర్వహించారు. అమ్మవారి అక్షింతలు, మంగళసూత్రాలను భక్తులు ఆశీర్వదించగా అర్చకుల వేదమంత్రోచ్చారణల మధ్య కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. కల్యాణోత్సవం సందర్భంగా అర్చకులు నిర్వహించిన ఆనంద నృత్యాలు, పూబంతుల ఆటలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్నమ్మ, ఏఈవో రవి, ఆలయ అధికారి వెంకటరమణ, గుణశేఖర్, వేదపండితులు రామ్‌ప్రసాద్, ధన్వంతరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

***కరివరదరాజ ఆలయంలో...*** మున్సిపల్ పరిధి సత్రవాడలో టీటీడీ ఆధీనంలోని కరివరదరాజ స్వామి ఆలయంలోను కల్యాణోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామిని సుందరంగా అలంకరించి సూర్యప్రభవాహనంలోఆలయ ప్రదక్షిణ చేశారు.ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

**నగరి, ఫిబ్రవరి 5 ప్రభాతవార్త:** మున్సిపల్ పరిధి ఏకాంబరకుప్పంకు చెందిన ఎస్ఎస్ కరుణాకరన్(24) మంగళవారం వేకువ జామున పల్లిపట్టురోడ్డు రాజేశ్వరి థియేటర్ సమీపం రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. అతన్ని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రాథమిక చికిత్స అనంతరం బంధువులు తిరుపతిలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం ఉదయం మరణించినట్లు సీఐ మహేశ్వర్ తెలిపారు. మృతదేహానికి నగరి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ఎస్వీయూ విశ్రాంత ఆచార్యులు మృతి



తిరుపతి విద్య ఫిబ్రవరి 12 ప్రభాత వార్త

ఎస్వీయూ మనోవిజ్ఞాన శాస్త్ర వ్యవస్థాపక సభ్యుడు, విశ్రాంత ఆచార్యులు పీవీ రామమూర్తి(88) బెంగుళూరులోని ఆయన నివాసంలో మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు.ఆయన మృతి పట్ల వర్సిటీ వీసీ సీహెచ్ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతినాయుడు,మాజీ వీసీలు జమున,శ్రీకాంత్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ హరికృష్ణ,ప్రొఫెసర్ లలిత తదితరులు ఆయన మృతి పట్ల తీవ్రదిగ్భ్రాంతిని తెలియజేశారు. ఈ సందర్భంగా వర్సిటీకి ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## ఐఐటి జెఈఈ మెయిన్స్ ఫలితాల్లో అమరావతి అకాడమీ ప్రతిభ



***తిరుపతి విద్య ఫిబ్రవరి 12 ప్రభాత వార్త*** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఎ) మంగళవారం విడుదల చేసిన జెఈ ఈ మెయిన్స్ 2025 ఫలితాలలో తిరుపతి లోని అమరావతి ఐఐటి అకాడమీ (కృష్ణారెడ్డి బి.వి.కే. గ్రూప్)లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు బి.అరుణ్ కుమార్ రెడ్డి 99.938, వి కేయూస్ సాయి 99.42,వైమనీష్ 98.98,కె సాయి సంతోష్ 98.50,జె లక్ష్మీ మాధురి 97.54,టి వంశీకృష్ణ 97.54,శ్రీ కీర్తన రెడ్డి 97.46,టి మానస్ కుమార్ 97.46, వి.కార్తిక్ శివ తేజ 97.23, జి.లాశ్య 97.03 పరసెంటైల్ సాధించారు.జాతీయస్థాయిలో 95 శాతం పైగా 50 మంది విద్యార్థులు పరసెంటైల్ సాధించారని100 మందికి పైగా విద్యార్థినీ,విద్యార్థులు 90 శాతం సాధించారని చైర్మెన్ బి వి కృష్ణారెడ్డి తెలిపారు.

## జేఈఈ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రభంజనం

తిరుపతి విద్య, ఫిబ్రవరి 12 ప్రభాత వార్త



ఎన్ టి ఎ గత నెల 21వతేదీ నుంచి నిర్వహించిన జేఈఈ మెయిన్స్ మొదటి విడత పరీక్ష ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి,టాప్ పర్సంటైల్ సాధించారని కళాశాల ఏజీఎమ్ బీవీ ప్రసాద్ తెలిపారు.ఇందులో అభిరామ్,ఓఎమ్ శర్మ 99.8 పర్సెంటైల్ సాధించగా,జీవన్ కుమార్ 99.2,నిఖిల్ 99.0, మంజునాథ్ 98.7,ప్రియాతమ్ 98.6,సీవీ వరుణ్ తేజ్ 98.2, మనోజ్ కుమార్ 98.2 పర్సెంటైల్ సాధించి విజయదుధుంబి మోగించారని హర్షం వ్యక్తం చేశారు.

## రిజిస్ట్రార్‌గా భాధ్యతలు చేపట్టిన భాస్కరుడు

తిరుపతి విద్య ఫిబ్రవరి 12 ప్రభాత వార్త



ఎస్వీ వేదిక్ వర్సిటీ నూతన రిజిస్ట్రార్ గా ఆచార్య పోకల భాస్కరుడు బుధవారం భాధ్యతలు చేపట్టారు.ఎస్వీ ఆర్ట్స్ కళాశాల గణితశాస్త్ర అధ్యాపకులు పనిచేస్తున్న ఆయనను వేదిక్ వర్సిటీకి రిజిస్ట్రార్గా నియమిస్తూ వీసీ రాణిసదాశివమూర్తి ఉత్తర్వులు జారీ చేసిన విషయం విదితమే. ఆయన మాట్లాడుతూ దేవదేవుని అనుగ్రహంతో రిజిస్ట్రార్ నియమితులు కావడం సంతోషంగా ఉందని వర్సిటీ అభివృద్ధికి అహర్నిశలు శ్రమిస్తానని తెలిపారు.

## సిఎంఎ ఇంటర్ ఫలితాల్లో ఎమరాల్డ్స్ విజయకేతనం

తిరుపతి విద్య ఫిబ్రవరి 12 ప్రభాత వార్త



ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ కొలకత్తా వారు విడుదల చేసిన ఫలితాల్లో ఎమరాల్డ్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించినట్లు ఎమరాల్డ్స్ డైరక్టర్లు ఇ.గిరిధర్,కె. విశ్వనాథ లు తెలియచేశారు. ఈ ఫలితాల్లో ఇంటర్ కోర్సు నందు 61.34 శాతంఉత్తీర్ణతసాధించడంతోపాటు పి. నికిత్ 476,ఎస్. సౌమ్య 432, ఆర్.గణేష్ 430,పి.కుసుమ 420,ఎం.సాయి తేజ 405,కె.కీర్తి400,కె.ద్వారకనాథరెడ్డి 400,సి.ఎ.హర్షిత 400, మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.

## శ్రీవారి సేవలో ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుమల,ఫిబ్రవరి 12ప్రభాతవార్తప్రతినిధి:



శ్రీవేంకటేశ్వరస్వామిని బుధవారం ఉదయం తిరుపతి జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు దంపతులు దర్శించుకున్నారు. విఐపి బ్రేక్ దర్శనంలో ఇష్టదైవమ్ వేంకటేశ్వరస్వామిని దర్శించుకుని ఆశీస్సులందు కున్నారు. వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శరవేగంగా కళత్తూరు తారు రోడ్డు నిర్మాణ పనులు

కేవీబీ పురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:

కేవీబీ పురం మండల కేంద్రం నుంచి కళత్తూరు వరకు ప్రభుత్వం మంజూరు చేసిన 75 లక్షల నిధులతో నిర్మితమవుతున్న తారు రోడ్డు, సిమెంటు రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డ కళత్తూరు, స్వర్ణ లింగేశ్వరపురం, వేములపూడి, అదరం గ్రామస్తులు ప్రస్తుతం ఉమ్మడి ప్రభుత్వంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత తిరుపతి జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి రోడ్డునిర్మాణ పనులు చేస్తున్న నేపథ్యంలో ఆ గ్రామస్తులందరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన చినబాబు

విజయపురం, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:



మండలంలోని జంబాద అనారోగ్యంతో మృతి చెందిన టీడీపీ నాయకుడు వెంకట్రాజు, కోసలనగరంలో మృతి చెందిన భాష్యం, మిట్టూరులో మృతి చెందిన రామరాజు మృతికి బుధవారం చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు నివాళులర్పించారు. వారి కుటుంబాలను పరామర్శించారు. సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, మాజీ సర్పంచ్ సుబ్రహ్మణ్యంరాజు, హరికృష్ణ, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

## ఇంటర్ సెకండియర్ ప్రాక్టికల్స్‌కు 103 మంది గైర్హాజరు

***తిరుపతి విద్య, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త*** సీనియర్ ఇంటర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు సోమవారం నుంచి ప్రాక్టికల్స్ ప్రారంభమయ్యాయి.ప్రతిరోజు ఉదయం మధ్యాహ్నం రెండు సెషన్స్ లలో నిర్వహించిన ప్రాక్టికల్స్ పరీక్షకు 103 మంది గైర్హాజరు అయ్యారు.తిరుపతి జిల్లా వ్యాప్తంగా 94 పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన ప్రాక్టికల్స్ కు జనరల్,ఒకేషనల్ విద్యార్థులు3978 మంది హాజరు అవ్వాల్సి ఉండగా వారిలో 62 మంది గైరుహాజరయ్యారు. మధ్యాహ్నం 94 పరీక్షా కేంద్రాల నిర్వహించిన ప్రాక్టికల్స్‌కు3862 మందికి గాను 41 మంది గైర్హాజరు అయినట్లు ఆర్ఐవో ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో మాఘపౌర్ణమి పూజలు



***తిరుపతి(రవాణ),ఫిబ్రవరి 12ప్రభాతవార్త:*** మాఘపౌర్ణమి సందర్భంగా బుధవారం సాయంత్రం తిరుపతి వినాయకసాగర్‌లో కొలువైన సంకల్పసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా స్వామివారికి అభిషేకాలు జరిపించి, అనంతరం పూజాది కార్యక్రమాలతో అలంకరించారు. ఆలయ అర్చకుడు సురేష్‌స్వామి మాఘమాసంలో వినాయకుడిని పూజించి దర్శించుకుంటే సకల శుభాలు కలుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొండె చెంగారెడ్డి, రాయలసీమ రంగస్థలి కళాసంస్థ చైర్మన్ గుండాల గోపీనాథరెడ్డి, సురేష్‌స్వామి, తొండమనాటి సుబ్రమణ్యంరెడ్డి, డిపి ఆనంద్, రాజశేఖర్‌రెడ్డి, వాసుదేవరెడ్డి భక్తులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయండి

-కేంద్రానికి తిరుపతి ఎంపి డాక్టర్ గురుమూర్తి వినతి



***తిరుపతి(రవాణ), ఫిబ్రవరి 12 ప్రభాతవార్త:*** ఆంధ్రప్రదేశ్ విభజన తరువాత తిరుపతి పార్లమెంట్ పరిధిలో జవహర్‌నవోదయవిద్యాలయం పాఠశాలను ఏర్పాటుచేయాలని తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి కోరారు. తిరుపతి పరిధిలో జవహర్ నవోదయ విద్యాలయం అవసరాన్ని గుర్తించి, మరింతమంది పేదపిల్లలను విద్యాపరంగా ప్రోత్సహించేందుకు అవసరమన్నారు. దేశఅభివృద్ధిలో విద్యాసంస్థలు కీలకమని, తిరుపతిలో విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలు ఉన్నాయన్నారు. తిరుపతి పార్లమెంట్‌లో నవోదయ విద్యాలయం ఏర్పాటుపై ఈ మేరకు బుధవారం ఆయన కేంద్ర ప్రభుత్వంతో చర్చించారు.

## కామాక్షి అమ్మవారికి వెండి ఆభరణాలు విరాళం

తిరుపతి(రవాణ),ఫిబ్రవరి 12ప్రభాతవార్త:



కపిలతీర్థంలోని కామాక్షిఅమ్మవారికి 9.115కిలోల వెండి ఆభరణాలను భక్తులు విరాళంగా సమర్పించారు.తిరుమలకు చెందిన ఎస్వీ నరహరి దంపతులు 9.28లక్షల రూపాయలు విలువైన 12 రకాల ఆభరణాలను కామాక్షిఅమ్మకు అలంకరిస్తారు. ఈ విరాళాలను బుధవారం ఉదయం టిటిడి జెఈఓ వీరబ్రహ్మంకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దాత కుటుంబసభ్యులు, ఆలయ డిప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఎఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ కెపి చంద్రశేఖర్, ఆలయ ఇన్స్పెక్టర్ రవికుమార్, డిఇ మల్లయ్య పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## జేఈఈ మెయిన్స్‌లో శ్రీధర్స్ అకాడమీ విద్యార్థుల విజయ దుందుభి



తిరుపతి విద్య, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త స్థానిక ఎయిర్ బైపాస్ రోడ్డులో ఉన్న శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు మంగళవారం ఎన్ టి ఏ విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విజయ దుందుభి మోగించారని కళాశాల చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు.జె ఈ ఈ మెయిన్స్ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్స్ సాధించిన విద్యార్థులు పి నిఖిలేశ్వర్ 99.25,ఎస్ మహమ్మద్ తాలిబ్ 98.74, ఎస్ ఎండి ఇమ్రాన్ 98.65, డి పోషిత 97.25 ,ఈ మంజుశ్రీ 97.02,నిత్యశ్రీ 92.02, పర్సంటైల్స్ ను సాధించారని అదేవిధంగా 10 మంది 90 పర్సంటైల్స్ ను, 53 మంది విద్యార్థిని,విద్యార్థులు 85 పర్సంటైల్స్ ను సాధించారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థిని, విద్యార్థులను చైర్మన్ మద్దినేని శ్రీధర్ అధ్యాపక బృందంను అభినందించారు.

## జేఈఈ ఫలితాల్లో అశ్వమేధ విద్యార్థుల ప్రతిభ.

తిరుపతి విద్య, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త



స్థానిక ఎంఆర్‌పల్లిలో ఉన్న అశ్వమేధ జూనియర్ కాలేజీ విద్యార్థులుకి మంగళవారం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఎ) విడుదల చేసిన జేఈఈ మెయిన్2025 ఫేస్ 1 ఫలితాలలో ప్రభంజనం సృష్టించారని కళాశాల డైరెక్టర్స్ అబ్దుల్ ఇశ్రత్, టిఎమ్ గోవర్ధన్ తెలిపారు.అత్యధిక పర్సంటైల్స్ సాధించిన విద్యార్థులు మొత్తం 156 మంది విద్యార్థులకు గాను పి నిఖిల్ 99.3, వెంకట సాయి 98.7, పర్సంటైల్,కే.యశ శ్రీ 98.5 పర్సంటైల్,వెంకట రెడ్డి 98.3 పర్సంటైల్,వి.మోక్షిత 92.4 పర్సంటైల్,శ్రీ వైష్ణవి 92.1 పర్సంటైల్స్ ను సాధించారని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్స్ సుమతి, రామయ్య,అధ్యాపకులు అభినందనలు తెలియజేసారు.

## పోలీసుల రూట్ మార్చ్:శివరాత్రిలో సహాకరించండి:



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి పోలీసులు మంగళవారం రాత్రి రూట్ మార్చ్ నిర్వహించారు.సాధారణంగా ప్రతి నెల పోలీసులు యస్‌పి ఆదేశాలతో పట్టణాల్లో రూట్‌మార్చ్ నిర్వహిస్తున్నట్లు డివైయస్‌పి నరసింహామూర్తి వివరించారు. రాత్రి పది గంటల తరువాత దుకాణాలు మూసివేయాలని ఆదేశించారు. మంగళవారం రాత్రి దుకాణాలను మూయించారు. శివరాత్రిలో శాంతి భద్రతల పరిరక్షణకు సహాకరించాలని డివైయస్‌పి సూచించారు. రూట్ మార్చ్ పెండ్లి మండపం నుంచి ప్రారంభం అయ్యింది. నగరివీది,బజారువీధి,తేరువీధి, నెహ్రూవీధి, సినిమా వీధి, పాతనెల్లూరు బస్టాండు, ఆర్‌టిసి రోడ్డుల్లో రూట్‌మార్చ్ సాగింది, డివిజన్‌లోని సిఐలు డి.గోపి,వెంకటేశ్వర్లు, రవీ నాయక్,తిమ్మయ్య ఎస్ఐ సుధాకర్,ఈశ్వరయ్యలు,బ్లూకోల్ట్స్,రక్షక్ సిబ్బంది పాల్గొన్నారు.

## దొడ్ల మునేంద్ర కుటుంబాన్ని ఆదుకుంటాం



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటిలో వాచర్‌గా పని చేసిన దొడ్లమునేంద్ర విధుల్లో ఉండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. బుధవారం శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి సతీమణి రిషితారెడ్డి తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి ఆయన కుటుంబాన్ని ఓదార్చారు. ఆదుకుంటామని భరోసి ఇచ్చారు. రెండవ వార్డులో కాపురముంటున్న మునీంద్ర కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు. మాజీమార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు మాజీ మున్సిపల్ వైస్ చైర్మెన్ మిన్నల్‌రవి,పులి శ్రీకాంత్, రోడ్ల గోపి,అనిత,సుమతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులకు అందుబాటులో హరిత్ హోటల్ సేవలు



**శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి సమీపంలో ఏర్పాటు చేసిన ఎపి టూరిజం శాఖకు చెందిన 'హరిత హోటల్' సేవలను సామాన్యులకు సైతం అందుబాటులోకి తీసుకురావటానికి మార్పులు చేర్పులు చేసినట్లు మేనేజర్ పరమేశ్ బుధవారం తెలిపారు.పట్టణ పొలిమేరల్లో ఏర్పాటు చేసిన హరిత హోటల్ ఏర్పాటు చేసారు. ఇక్కడ ప్రయాణీకులు,యాత్రికులకు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించారు. అయితే జాతీయ బైపాస్‌లు రావటంతో బస్సులన్నీ బైపాస్‌మీదుగా వెళుతుండటంతో నిర్వహణ దృష్ట్యా పలు మార్పులు చేస్తూ నిర్వాహకులు చర్యలు తీసుకున్నారని తెలిపారు.ప్రత్యేక సందర్భాల్లో అనువైన వేదికను ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈవెంట్స్ కోసం అవుట్‌డోర్ క్యాటరింగ్‌ను,నాణ్యతమైన వంటకాలను అందించుటకు నిర్వాహకులు ఆదేశించినట్లు వివరించారు. వివరాల కోసం918019859555కు సంప్రదించాలని పిలుపు నిచ్చారు.

## పౌర్ణమి సందర్భంగా వాడవాడల్లో అన్నదానాలు



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని తేరువీధిలో వెలసిన కైలాస్ గ్రాండ్‌లో బుధవారం వేలాది మందికి అన్నదానం జరిపారు.ప్రతి పౌర్ణమికి ఈ గ్రాండ్ నిర్వాహకులు ఆరుగురు కలసి పేదలకు అన్నదానం జరపటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం భారీ ఎత్తున ఎపేదలకు భోజనాలు ఏర్పాటు చేసారు. కాగా బిక్షాల గాలిగోపురం ఎదురుగా ఆర్‌టిసి బస్టాప్ వద్ద పూర్వ విద్యార్థుల సారథ్యంలో అన్నదానం జరిపారు. విద్యార్థి నాయకుడు చేజర్ల హరి మిత్రబృందంచే అన్నదానం జరిపారు.కాగా ముక్తిగణపతి ఆలయం కైలాసగిరుల్లో నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి ఎగువన వెలసి ఉంది. అక్కడ భక్తులు అన్నదానం ఏర్పాటు చేసారు.

## సామాన్య భక్తులకు సుదర్శనం: సౌకర్యాలపై దృష్టి సారించండి



**శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఇచ్చిన మాట ప్రకారం సామాన్యభక్తులకు సుదర్శనంతో పాటు సత్వర దర్శనం ఏర్పాటు చేయాలని అలాగే దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు సౌకర్యాలపై దృష్టి సారించాలని రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. బుధవారం ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి సారథ్యంలో దేవాదాయశాఖ మంత్రికి ఆహ్వాన పత్రికను అందించారు. మంత్రి ఈ నెల 1న శ్రీకాళహస్తిలో నిర్వహించిన సమావేశంలో ప్రకటించిన ప్రకటనల్లో అమలు పరిస్థితి ఏమిటని ప్రశ్నించినట్లు తెలిసింది. ముఖ్యంగా పార్కింగ్ విఐపిలకు దర్శనాలు, ఉచిత బస్సులు,సామాన్యులకు సైతం విఐపి స్థాయి దర్శనాలకు అవకాశం కల్పించాలన్నారు. సారె అందించటానికి ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు వచ్చే నాటికిఅన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మంత్రి ఆనం చర్చించినట్లు సమాచారం. ఇఓతో పాటుడెప్యూటీఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డి ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్,వేదపండితులు శివప్రసాద్‌శర్మ,ఎఇఓ హేమామాలిని, రాజా,వేదపండితులు ప్రభాకర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

## పాండురంగస్వామి అగ్నిగుండమహోత్సవం

శ్రీకాళహస్తిరూరల్, 12 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం అక్కుర్తి గ్రామం వద్ద ఏర్పాటు చేసిన పలు ధార్మిక,అధ్యాత్మిక కార్యక్రమాల్లో శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల రిషితారెడ్డి హాజరయ్యారు.ఇక్కడ ఆంజనేయస్వామి ఆలయలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కాగా గ్రామంలో పాండురంగస్వామి అగ్నిగుండ మహోత్సవంను వైభవంగా నిర్వహించారు. ఆమెకు గ్రామస్థులు భారీ ఎత్తున స్వాగతం పలికారు.ఆమెతో పాటు మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, ఆయకట్టు అధ్యక్షుడు రాఘవరెడ్డి, ఉపాధ్యక్షులుసరేంద్రబాబు,సుదర్శనం,మునిరామయ్య,జి.రవి, నాగార్జున్‌రెడ్డి, సతీష్, నరేష్, శీను పాల్గొన్నారు.

## డిల్లిలో మంత్రులకు శివరాత్రి ఆహ్వానాలు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 12 ప్రభాతవార్త





శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21నుంచి ప్రారంభం అయ్యే మహాశివ రాత్రి బ్రహ్మోత్సవాలకు స్థానిక శాసన సభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి డిల్లిలో రెండు రోజులుగా మంత్రులను కలసి ఆహ్వానాలు అందించారు. ఢిల్లీలోఉన్న మంత్రులు ఎంపిలు రామమోహన్,హరీష్‌లు ముగ్గురు కలసి శ్రీకాళహస్తి గురించి వివరిస్తూ మంత్రులను ఆహ్వానిస్తున్నారు. ప్రధాని అపాయింట్‌మెంట్ కోసం ఎదురు చూస్తున్నారు. బుధవారం పార్లమెంట్ స్పీకర్ ఓం ప్రకాష్ బిర్లా, పియుష్‌గోయల్,కేంద్ర మంత్రి రామమోహన్‌నాయుడు, కుమారస్వామి గౌడ్‌లను కలసి ఆహ్వానించారు.

# గూడూరు డివిజన్

## టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందజేయండి



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : గత టిడిపి ప్రభుత్వ హయాంలో మన్నారుపోలూరు ప్రాంతంలో నిర్మించి ఉన్న టిడ్కో ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు పి.హరినాథరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టిడ్కో ఇళ్ల 90 శాతం పనులు ఇప్పటికే పూర్తయి ఉన్నాయని, ప్రభుత్వం చొరవ తీసుకొని అర్హులకు అందజేయాలని కోరారు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఈ విషయంలో చొరవ తీసుకోవాలని కోరారు. ఇళ్లను పరిశీలించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మోదుగుల పార్థసారథి, సిపిఐ నాయకులు సుధాకర్‌రెడ్డి, ఎ.ఆనందబాబు, ఇలపల నాగేంద్రబాబు, బాలయ్య, లక్ష్మి, బాలు, అశోక్‌బాబు ఉన్నారు.

## అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

**- సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా**



కోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా కోరారు. బుధవారం కోట ఎంఆర్‌సి భవనంలో రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నెలరోజుల పాటు నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వచ్చిన అర్జీలు ఎన్ని పరిష్కారమయ్యాయి, ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయని అధికారులను అడిగారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలపై దృష్టి సారించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో తహశీల్దార్ కె.జయజయరావు, డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లా ఖాన్, సర్వేయర్ గోపిరెడ్డి, విఆర్‌ఓలు, విఎస్‌లు పాల్గొన్నారు.

## ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత కల్పించండి

వాకాడు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : ఆప్కస్ కంటే మెరుగైన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం భద్రత కలిపే విధంగా చర్యలు చేపట్టాలని కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ జిల్లా కార్యదర్శి హేమంత్ అన్నారు. బుధవారం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయంలోని ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ క్యాలెండర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంటాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ప్రభుత్వం తగు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవా ఇంద్ర, ప్రసన్న, కస్తూరయ్య, రాజకుమారి, దావీదు, సుబ్బయ్య, నాగరాజు ఉన్నారు.



## ఈ-ఆఫీస్ నిర్వహణపై శిక్షణ

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : సూళ్లూరుపేట రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల సిబ్బందికి ఈ-ఆఫీస్ నిర్వహణపై బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ కిరణ్మయి ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. ఫైళ్ల నిర్వహణ సులభతరం చేయడంతో పాటు పారదర్శకంగా అన్ని పనులు నిర్వహించే విధంగా సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## రైల్వే ఉద్యోగుల నిరసన




తడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : అధికారుల కారణంగానే తడ మండలం అనపగుంట వద్ద రైలు ప్రమాదం జరిగిన ఒక రైల్వే ఉద్యోగి మృతిచెందాడని రైల్వే ఉద్యోగులు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం రైల్వే ట్రాక్‌పై విధులు నిర్వహిస్తున్న ఇద్దరు గ్యాంగ్‌మెన్లను సూళ్లూరుపేట నుంచి చెన్నై వైపు వెళుతున్న రైలు ఢీకొన్న ప్రమాదం కేవలం పైఅధికారుల నిర్లక్ష్యమే అన్నారు. ఆ ప్రమాదంలో కేరళకు చెందిన అభిషేక్ (30) అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన బీహార్‌కు చెందిన ముంజయ్‌కుమార్ (32)ను చెన్నై రైల్వే ఆసుపత్రికి తరలించి ఉన్నారు. బుధవారం కేరళ నుంచి అభిషేక్ కుటుంబ సభ్యులు సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి వచ్చి శవాన్ని చూసి బోరున విలపించారు. దూరప్రాంతాల నుంచి ఇక్కడికి రైల్వే విధులకు వచ్చి ప్రమాదానికి గురవడం స్థానికులను కూడా కలచివేసింది. ఇదిలావుంటే మంగళవారం నుంచి గత రెండురోజులుగా రైల్వే ఉద్యోగులు సూళ్లూరుపేట బ్రాంచి కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్నారు. బుధవారం సూళ్లూరుపేట రైల్వేస్టేషన్, ఇంజినీరింగ్ కార్యాలయాల వద్ద న్యాయం చేయాలంటూ గొంతెత్తారు. ఈ సందర్భంగా సదరన్ రైల్వే మజ్దూర్ యూనియన్ సూళ్లూరుపేట శాఖకు చెందిన చెంచురత్నం మాట్లాడుతూ ఇటీవల ఇటువంటి నిర్లక్ష్యాల కారణంగా పలువురు ప్రమాదాలకు గురవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికే సూపర్‌వైజర్‌ను ప్రశ్నించామని, పని ఒత్తిడి కూడా ఉద్యోగులకు ఎక్కువయిందని పేర్కొన్నారు. సంబంధిత జేఇలు, సూపర్‌వైజర్లపై కఠిన చర్యలు తీసుకునేదాకా విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు.

## ల్యాండ్ కన్వర్షన్‌ను పరిశీలించిన సబ్ కలెక్టర్



వాకాడు, ఫిబ్రవరి 12, ప్రభాతవార్త : వాకాడులో బుధవారం గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న ల్యాండ్ కన్వర్షన్ను పరిశీలించారు. సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా వాకాడు తహశీల్దార్ రామయ్య, మండల సర్వేయర్ శకుంతల, ఆర్.ఐ.అఖిల్‌లను వివరాలు అడిగి తెలుసు కున్నాడు, ల్యాండ్ కన్వర్షన్ సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తు నాలుగు దిక్కుల జెండాలను చూసి స్థలం సంబంధించిన పూర్తిస్థాయిలో సబ్ కలెక్టర్ తిరిగి చూశారు. ఆయన వెంట వీఆర్వో కాటమ్మ, సర్వేయర్లు శ్రీలత, రెవెన్యూ సిబ్బందితో పాటు ల్యాండ్ కన్వర్షన్ నిర్వాహదారులు కూడా ఉన్నారు.

## శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ ఆలయంలో విశేష పూజలు



చిల్లకూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : తూర్పు కనుపూరు గ్రామం చిల్లకూరు మండలం కనుపూరు గ్రామంలో స్వయంభుగా వెలసివున్న శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం నందు శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయన హేమంత రుతువు మార్గశిర మాసం మాగ పౌర్ణమి సందర్భంగా అనగా బుధవారం ఉదయం నుండి చండీ హోమం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం పల్లకిసేవ నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా శివ వరప్రసాద్ శర్మ హేమలత (తూర్పు కనుపూరు) ఇరగరాజు శ్రీనివాసులు, వానమ్మాలు, (తూర్పు కనుపూరు) కాపులూరు జనార్ధన్, సుకన్య (నెల్లూరు) గూడూరు రూరల్ సిఐ కిషోర్ బాబు వ్యవహరించారు. ఈ పూజా కార్యక్రమంలో ఛైర్మన్, ధర్మకర్త మండలి, కార్య నిర్వహణ అధికారి పాల్గొన్నారు.

## గుర్తింపు కార్డుపై రైతులకు అవగాహన



తడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : తడ మండలం వాటంబేడులో బుధవారం రైతులకు విశిష్ట గుర్తింపు కార్డు ప్రాధాన్యత గురించి వ్యవసాయ శాఖ అధికారి కిరణ్ సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్, ఎంఎఎ విజయలక్ష్మి ఆధ్వర్యంలో విశిష్ట గుర్తింపు ప్రాధాన్యత గురించి వివరించారు. పలువురు రైతులు తమ పాస్‌పుస్తకాలు, ఆధార్‌కార్డులు వంటివి తీసుకొచ్చి అధికారుల ద్వారా విశిష్ట గుర్తింపు వచ్చే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ గ్రామానికి సూళ్లూరుపేట ఏడీ అనిత కూడా వచ్చి రైతులతో ఈ కార్యక్రమం వివరాలు చర్చించి వెళ్లారు.

## ఆందోళన విరమించిన నిర్వాసితులు




కోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాలెం గ్రామ సమీపంలో బుధవారం కొందరు నిర్వాసితులు తమకు పరిహారం ఇవ్వాలని నిరసన తెలిపారు. సాగరమాల రోడ్డు నిర్మాణం పనులను అడ్డుకుంటామని వారు చెప్పారు. సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ కె.జయజయరావు అక్కడికి వెళ్లి నిర్వాసితులతో మాట్లాడారు. రోడ్డు నిర్మాణం పనులు పూర్తయిన తర్వాత గ్రామసభ ఏర్పాటు చేసి రికార్డుల ప్రకారం ఎవరు అర్హులో వారందరికీ పరిహారం ఇప్పిస్తామని హామీ ఇవ్వడంతో నిర్వాసితులు శాంతించారు. రోడ్డు నిర్మాణ పనులకు ఒప్పుకున్నారు.

## పల్లె పండుగకు 2.59 కోట్లు మంజూరు : ఎంపిడిఓ

కోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : కోట మండలంలో పల్లెపండుగ కింద 57 పనులకుగాను 2 కోట్ల 29 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎంపిడిఓ వేణు చెప్పారు. బుధవారం కోటలోని తన కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. మండలంలో 37 సిమెంటు రోడ్ల పనులు పూర్తయ్యాయని, మరో 20 పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. దీంతో పల్లెరోడ్లకు కళ ఏర్పడిందన్నారు. రోడ్ల నిర్మాణం పూర్తి చేసిన వారికి ఇప్పటికే రూ.50 లక్షలు బిల్లులు చెల్లించినట్లు తెలిపారు.

## మానసిక సమస్యలపై అవగాహన సదస్సు



కోట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మానసిక సమస్యలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా నెల్లూరుకు చెందిన డాక్టర్ వి.సుజాత విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపకులకు మానసిక సమస్యలపై తగు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, సైన్స్ అండ్ హుమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ సి.రవీంద్రారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఉదయ్‌కుమార్‌రాజు, హరికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

## రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం



తడ, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : తడ మండలం రామాపురం పంచాయతీ పరిధిలో పల్లెపండుగ సిసి రోడ్డు నిర్మాణం పనులు చేస్తున్నారు. గ్రామ సర్పంచ్ టికె శ్రీనివాసన్ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయి. బుధవారం రోడ్డు పనులను ఎంపిడిఓ విజయకుమార్, పిఆర్ ఏఇ దిలీప్ తదితరులతో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన జాగ్రత్తలు సూచించారు.

## రాష్ట్రమంత్రి జనార్ధన్‌రెడ్డిని కలిసిన సతీష్‌రెడ్డి



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : తిరుపతి తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి బుధవారం అమరావతిలో ఆర్‌అండ్‌బి శాఖ మంత్రి బిసి జనార్ధన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సూళ్లూరుపేట ఆర్‌అండ్‌బి పరిధిలో ఉన్న సమస్యలను పరిశీలించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. పట్టణంలోకి సమీపంలో చెంగాళమ్మ గుడి వద్ద శిథిలావస్థలో ఉన్న వంతెనను నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. వేనాటి సతీష్‌రెడ్డితో పాటు మంత్రిని కలిసిన వారిలో కందల కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఆర్చి నిర్మాణానికి భూమిపూజ



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : సూళ్లూరుపేట పట్టణంలోని కోళ్లమిట్టలో శ్రీభగవాన్ వెంకయ్యస్వామి ధ్యాన మందిర ముఖద్వార నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ చేతులు మీదుగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే దంపతులు వెంకయ్యస్వామి ఆలయానికి వెళ్లి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ముఖద్వార నిర్మాణ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖద్వార నిర్మాణానికి టిడిపి నేతలు తిరుమూరు సుధాకర్‌రెడ్డి రూ.10 వేలు, పట్టణ టిడిపి అధ్యక్షుడు ఆకుతోట రమేష్ రూ.10 వేలు విరాళంగా ఎమ్మెల్యే దంపతుల చేతులు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చిట్టేటి పెరుమాళ్లు, మేడా సాయి నారాయణ, కుదిరి పెంచలయ్య, కొండలరావు, కె.శ్రీధర్, చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదార్లు



నాయుడుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : ప్రమాదాలకు నియలంగా జాతీయ రహదార్లుపై అడ్డుకోలుగా వాహనాలు నిలపడం వల్లన ఎంతోమంది నిండుప్రాణాలు ప్రమాదాలు జరిగి గాలిలో కలిసిపోతున్నా పోలీసులు మాత్రం చర్యలు తీసుకోవడంలేదని వాహనదారులు ఆరోపిస్తున్నారు. ఇందుకు ఉదాహరణ ఇటీవల మల్లాంజంక్షన్ సమీపంలో నూతనంగా నిర్మించిన రింగ్‌రోడ్డుపై జరిగిన రోడ్డుప్రమాదంలో సోలేటి ప్రవీణ మృతిచెందిన సంఘటన తెలిసిందే. నిబంధనుల ప్రకారం వాహనాలను రెస్ట్ ఏరియాలో మాత్రమే వాహనాలను నిలపాల్సి వుండగా నాయుడుపేటలో మాత్రం ఎక్కడ హోటల్ కనపడితే అక్కడ అడ్డుగోలుగా వాహనాలను జాతీయ రహదారిపై నిలిపేస్తున్న పోలీసులు పట్టించుకోవడంలేదన్న విమర్శలు ప్రజల నుండి వ్యక్తమౌతున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జాతీయరహదార్లపై వాహనాలు నిలపకుండ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## భోజనశాల నిర్మాణానికి భూమిపూజ

నాయుడుపేట, పిబ్రవరి 12 ప్రభాతవార్త : నాయుడుపేట పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు మధ్యాహ్న భోజనశాలలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం గమనించిన పట్టణ రోటరీక్లబ్ ఆధ్వర్యంలో బెస్టరన్నర్స్ ఆర్గనైజేషన్ యూనియన్ వారు 2లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. రోటరీక్లబ్ ప్రసిడెంట్ జయరాజగోపాల్ చేతులు మీదుగా బుధవారం ప్రదానోపాధ్యాయులు సురేష్‌కు చెక్కును అందజేశారు. రీటరీక్లబ్ బెస్టరన్నర్స్ ఆర్గనైజేషన్ యూనియన్ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

## 18న స్వర్ణాంధ్ర-స్వచ్ఛంధ్ర కార్యక్రమం : కమిషనర్



నాయుడుపేట, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మెరకు ప్రతినెల 3వశనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని నాయుడుపేట మున్సిపాల్టి కమిషనర్ పజులుల్లా బుధవారం తెలిపారు. నాయుడుపేట అంబేద్కర్ భవన్‌లో ఆయన ఆధ్వర్యంలో పురపాలక సంఘంలోని మెప్మాగ్రూపు సభ్యులకు, పారిశుద్ధ్య కార్మికులకు తడిచెత్త, పొడిచెత్త హోమ్ కంపోస్టింగ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపాల్టి కమిషనర్ మాట్లడుతూ ప్రతిఒక్కరు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మెప్మాగ్రూపు సభ్యులు, పారిశుధ్య కార్మికులు, మున్సిపాల్టి సిబ్బంది పాల్గొన్నారు.

## కాణిపాకంలో శాస్త్రసోక్తంగా సత్యనారాయణవ్రతం



కాణిపాకం, ఫిబ్రవరి 12ప్రభాతవార్త: ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయంలో బుధవారం సత్య నారాయణవ్రతంను శాస్త్రోక్తంగా అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రధాన ఆలయం అనుబంధ ఆలయమైన శ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఈవ్రతాన్ని నిర్వహించారు. అనంతరం సత్యనారాయణ వ్రతంను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరెండెంట్ కోదండ పాణి, అర్చకులు, కృష్ణమాచార్యులు, రవిస్వామి, రఘునంధనస్వామి, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా పున్నమి గరుడసేవ:**

శ్రీశ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా బుధవారం రాత్రి పున్నమి గరుడసేవను అత్యంత ఘనంగా నిర్వహించారు.

## అసంఘటిత కార్మికులకు సాంఘీక భద్రత : కలెక్టర్

చిత్తూరు, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: అసంఘటిత కార్మికులకు సామాజిక భద్రత, సంక్షేమ పథకాల వర్తింపుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని, ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఉచిత నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం ఈ-శ్రమ్ పోర్టల్‌లో అసంఘటిత కార్మికుల ఉచిత నమోదుపై కలెక్టర్ సుమిత్‌కుమార్ సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ అసంఘటిత కార్మికులు, వలస కార్మికులు, వారి కుటుంబ సభ్యులకు సామాజిక భద్రత నిమిత్తం కేంద్ర ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా ఈ-శ్రమ్ పోర్టల్‌లో ఉచిత నమోదు, గుర్తుంపు కార్డుల జారీ చేయడం జరుగుతుందన్నారు. 16-59 సంవత్సరాల వయస్సులోపు వుండి ఆదాయపన్ను చెల్లించని వారు ఇపిఎఫ్, ఈఎస్ఐ సదుపాయం లేని వారు ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జడ్పీ సిఇఓ రవికుమార్‌నాయుడు, కార్మిక శాఖ డిప్యుటీ కమీషనర్ ఓంకార్, డ్వామా పిడి రవికుమార్, బిసీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి, ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి చెన్నయ్య, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోండి : ఎస్పీ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈనెల 20వ తేదీ నుంచి 13 రోజుల పాటు నిర్వహించనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో పటిష్టమైన బందోబస్తు నిర్వహించి భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తెలిపారు. బుధవారం ఆయన శ్రీకాళహస్తీశ్వరాలయంకు విచ్చేసి పలు క్యూలైన్లను పరిశీలించి అధికారులకు పలుసూచనలు, సలహాలు ఇచ్చారు. డిఎస్పీ నరసింహమూర్తితో ఆలయానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆలయానికి విచ్చేసే భక్తులకు నాలుగు గేట్ల ప్రధాన ద్వారం వద్ద నుంచి రెండు, మూడు, నాలుగోగేటు వద్ద పరిశీలించడంతోపాటు ఆలయంలో క్యూలైన్లను పరిశీలించారు. డిఎస్పీ నరసింహమూర్తి, అర్బన్ సిఐ డి.గోపి, టుటౌన్‌సిఐ వెంకటేశులు, బిఎన్‌కె సిఐ తిమ్మయ్య, రూరల్ సిఐ రవినాయక్, తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్యలు, ఎస్‌బి చెంచురామయ్యతో కలసి పార్కింగ్ స్థలాలు పరిశీలించి పలుసూచనలు ఇచ్చారు.

## మరమ్మతుల అంచనాలు శనివారం లోపు పంపండి

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్**



తిరుపతి కలెక్టరేట్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త :ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలో అవసరమైన మరమ్మత్తుల నిధులకు సంబంధించిన అంచనాలు శనివారం లోపు పంపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ గిరిజన, సంక్షేమ శాఖాధికారులతో అలాగే మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల సమన్వయ కర్తలు, ఇంజనీరింగ్ అధికారులతో జిల్లా కలెక్టర్ టెలికాన్ఫెరెన్స్ సమీక్షా సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలో కనీస అవసర మరమ్మతులను త్వరితగతిన సంబంధిత శాఖాధిపతులు గుర్తించి వాటికి అవసరమైన నిధులకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేసి, రానున్న శనివారం నాటికి పరిపాలన అనుమతులకు సమర్పించాలని ఆదేశించారు. టెలికాన్ఫెరెన్స్ నందు జిల్లా సాంఘిక సంక్షేమ, సాధికార అధికార విక్రమ్ కుమార్‌రెడ్డి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఏపీ ఈడబ్ల్యూ ఊడీసీ బాలసుబ్రమణ్యంరెడ్డి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి చంద్రశేఖర్, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సూర్యనారాయణ, మహాత్మా, జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల జిల్లా సమన్వయకర్త రేష్మ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ కర్త గీత, సంక్షేమ శాఖ ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పసిడి వాహనాలపై పంచమూర్తు గ్రామోత్సవం




శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో భారీ ఎత్తున పంచమూర్తుల ఊరేగింపు నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ముందు నిర్వహించే ఉత్సవం సద్యోముక్తి ఉత్సవం. ఉదయం నుంచి సువర్ణముఖి నదిలో పంచమూర్తుల్ని అభిషేకించారు, అనంతరం ఆలయంలోకి స్వామి అమ్మవార్లను చేర్చి పూజలు నిర్వహించారు. నెల్లూరుకు చెందిన వేనాటి కుటుంబం బంగారు వాహనాల్ని సమర్పించారు. అధికారులు చొరవతో బంగారు వాహనాలు వచ్చాయి. శివరాత్రికి ముందు నిర్వహించే సద్యోముక్తి ఉత్సవాలతో శివరాత్రికి శ్రీకారం చుట్టినట్లు అయ్యింది. ఉత్సవాలతో టెంపుల్ ఇన్స్పెక్టర్ హరియాదవ్, దఫేదార్ రాజా, ఉభయదారులు తదితరులు పాల్గొన్నారు.

## మధ్యవర్తి హత్య కేసులో నిందితుడు అరెస్ట్ : సిఐ



చంద్రగిరి, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త: అన్నదమ్ముల విషయంలో తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు వెళ్ళిన పాపయ్య నాయుడును హత్య చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సిఐ సుబ్బరామిరెడ్డి తెలిపారు. పెనుమూరు మండలం, కామచిన్నయ్య పల్లి పంచాయతీ, వేమూరివాండ్లపల్లికి చెందిన వేమూరి పాపయ్య నాయుడు అలియాస్ పాపయ్య (62) చంద్రగిరి మండలం, తొండవాడలో నివశిస్తున్నాడు. ఈ నెల 7న పూతలపట్టు మండలం, పి.కొత్తకోట పంచాయతీ, సిరిపురం గ్రామానికి చెందిన రాజేష్, హరి నాయుడు అన్నదమ్ముల మధ్యన తలెత్తిన వివాదాన్ని పరిష్కరించేందుకు పాపయ్య ప్రయత్నించాడు. ఈ క్రమంలో తక్కిలపాటి హరి నాయుడు (35) పాపయ్యపై దాడి చేశాడు. ఈ దాడిలో అపస్మారక స్థితిలోకి జారుకున్న పాపయ్యను తిరుపతి రుయాకు తరలించారు. చికిత్స పొందుతూ పాపయ్య మృతి చెందడంతో మృతుడి కుమారుడు వేమూరి హరీష్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై డిఎస్పీ ప్రసాద్ పర్యవేక్షణలో సిఐ సుబ్బరామిరెడ్డి తన సిబ్బందితో నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఈ నేపథ్యంలో కేవలం మూడు రోజుల్లో నిందితుడి ఆచూకీని పసిగట్టి బుధవారం శ్రీవారిమెట్టు సర్కిల్, శ్రీనివాస మంగాపురం వద్ద అరెస్ట్ చేసి కారును సీజ్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో హెడ్ కానిస్టేబుల్ మునిప్రసాద్, కానిస్టేబుల్స్ మునిరత్నం, పురంధర్, దివాకర్, గోపి చురుగ్గా వ్యవహరించారు.

## లక్ష్మీరెడ్డికి అండగా భూమన, అభినయ్

**- ఆమె చూపించిన ఆధారాలు అన్ని మార్ఫింగ్**

**- విలేకరుల సమావేశంలో జనసేన ఇన్‌చార్జి కిరణ్‌రాయల్**




తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 12 ప్రభాతవార్త : లక్ష్మీరెడ్డికి అండగా భూమన అభినయ్‌రెడ్డి ఉన్నారని జనసేన పార్టీ నేత కిరణ్‌రాయల్ తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. లక్ష్మీరెడ్డి నాపై చేసిన ఆరోపణలు అన్నీ అబద్ధాలేనని, నాకు ఒక గంట, ఒక రోజు టైం ఇస్తే మార్ఫింగ్ చేసి ఆడియో, వీడియోలు రిలీజ్ చేసి అందరి జీవితాలను తారుమారు చేస్తానన్నారు. ఆమెపై ఎన్నో కేసులు ఉన్నాయని, ఆకేసుల్లోనే ఆమెను జైపూర్ పోలీసులు అరెస్టు చేయడం జరిగిందన్నారు. నాపై వైసీపీ పార్టీ నేతలు రెండు సంవత్సరాల నుంచి నన్ను ఏదో విధంగా రాజకీయంగా దెబ్బకొట్టేందుకు చూస్తున్నారని, అది ఇప్పుడు లక్ష్మీరెడ్డి ద్వారా సాధ్యమైందన్నారు. కానీ ఇలాంటి బెదిరింపులకు నేను భయపడనని, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఏవిధంగా ఆదేశాలు ఇస్తే ఆవిధంగా నడుసుకుంటానన్నారు. లక్ష్మీరెడ్డి అమాయ కరాలు అని అలాంటి ఆమెకు నేను దగ్గరుండి బెయిల్ తీసి ఇచ్చి ఉంటానని, అయితే వైసీపీ ట్రాప్‌లో పడి తనపై ఆరోపణలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.



తిరుమలలో బుధవారం పద్మావతి విచారణ కేంద్రం పక్కన చెక్ అవుట్ కౌంటర్లను ప్రారంభించిన భాస్కర్, ఓఎస్‌డి సత్రనాయక్, సూరిన్‌టెండెంట్ భాస్కర్ తదితరలు - ప్రభాతవార్త, తిరుమల